# I. పద్యభాగం - ప్రాచీన కవిత్వం

## 1. శకుంతలోపాఖ్యానం

### - నన్నయభట్టు

ఈ పాఠ్యభాగం నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోనిది. నన్నయ క్రీ.శ. 11వ శతాబ్దికి చెందిన కవి చాళుక్య ప్రభువైన రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఉన్నాడు. ఈయనకు ఆదికవి, వాగను శాసనుడునే బిరుదాలున్నాయి. నన్నయ ఆంధ్రమహాభారతంలో ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలోని చతుర్థాశ్వాసంలో 142వ పద్యంవరకూ అనువదించాడు. ఈయన ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసము, ఇంద్రవిజయము, లక్షణసారము, రాఘవాభ్యుదయము అనే కావ్యాలు రచన చేశాడని అంటారు. ఐతే ఇవి అలభ్యాలు.

భారత రచనకు చేదోడుగా 'వాఙ్మయ దురంధరుడైన' నారాయణభట్టు ఉన్నాడు. ఈయన సంస్కృత, పైశాచిక, కర్ణాటాంధ్ర భాషాసుకవి శేఖర అని పేరుగాంచాడు. నన్నయ తన కవిత్వంలో ప్రసన్నకథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తులుంటాయని పేర్కొన్నాడు. భారత అనువాదం యథాతథంగా జరగలేదు. సందర్భాన్ని బట్టి కాలానుగుణమైన మార్పు కన్పిస్తుంది. ఐతే మూలకథకు భంగం లేకుండా "విద్వజ్జనంబుల యనుగ్రహంంతో" ఈ కావ్య రచన చేస్తున్నానని అన్నాడు.

సంస్కృత మహాభారతాన్ని వ్యాస మహర్షి వాణీ దరహాసమైన మహేతిహాసంగా తీర్చిదిద్దాడు. నన్నయ దానికి కావ్య కమనీయతను కలిగించి నూతన వన్నె తెచ్చాడు. ఎన్నో ధర్మాలను, ధర్మ సూక్ష్మాంశాలను మనోహరంగా చెప్పాడు. పురుషార్థాలను ఆవిష్కరించాడు. పైగా తెలుగువారి ఆచారసంప్రదాయాలు మానవ మనస్తత్వం అన్ని తెలుగు భారతానువాదంలో కన్పిస్తాయి.

ఈ పాఠ్యాంశం శకుంతల దుష్యంతుల వృత్తాంతం.

* * *

# పాఠ్యాంశం

## దుష్యంతుడు వేటకరుగుట

శా. ఆ దుష్యంతుఁ డనంత సత్త్వుఁడు సమస్తాశాంతమాతంగ మ
ర్యాదాలంకృతమైన భూవలయ మాత్మాయత్త మై యుండఁగా
నాదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్యదేశాళితో
నాదిక్షత్త్ర చరిత్ర నేలె నజితుండై బాహువీర్యంబునన్. 1

క. ఆతని రాజ్యంబున ను
ర్వీతలము ప్రజాసమృద్ధి వెలసి రుజాశో
కాతంక క్షయ శంకా
పేతం బై ధర్మ చరితఁ బెరుఁగుచు నుండెన్. 2

వ. అమ్మహీపతి యొక్కనాఁడు మృగయావినోదార్థి యయి యాదిత్యహయంబుల కంటే వడిగల హయంబులు పూనిన రథం బెక్కి యాజానేయతురంగారూఢు-లైన యాశ్వికులు పరివేష్టించి రాఁగ ననంతకుంతశక్తిచాప కృపాణపాణులయిన వీరభటసహస్రంబులతోఁ జని వనంబులోని మృగంబులం జుట్టుముట్టి. 3

క. కలయఁగ నార్పుల బొబ్బల
యులివున నవ్విపిన మను మహోదధిఁ బెలుచం
గలఁచెను దుష్యంత మహా
బల మందరనగము సత్త్వభయజననంబై. 4

క. సరభస పరిచరిత మహా
శరభ ద్విపరిపు వరాహ శార్దూల మద
ద్విరదాది ప్రకర భయం
కరవనమధ్యమున నృపతి గడుఁ గడిమిమెయిన్. 5

క. ఓసరిలి పఱచు మృగముల
నేసియు, డాసిన మృగముల నెగచి భుజాసిన్
వ్రేసియుఁ, జంపెను మృగయా
వ్యాసక్తి నపారఘోరవన్యమృగాళిన్. 6

వ.	ఇట్లు పెక్కుమృగంబుల నెగిచి చంపుచు మఱియుఁ జంపెడువేడుక నతి దూరంబున కరిగిన, నాతని రథవేగంబు ననుగమింపనోపక యధిక క్షుత్పిపాసా పరవశు లయి పదాతు లయ్యయి ప్రదేశంబుల విశ్రమించి; రంత దుష్యంతుండు కతిపయామాత్య పురోహితసహితుం డై కొండొకనేల యరిగి, ముందట నొక్క పుణ్యనదీతీరంబున వివిధసురభి కుసుమఫల భారవినమ్ర తరులతాగుల్మ పరిశోభితం బయిన యొక్క వనంబు గని.	7

## కణ్వాశ్రమ వర్ణన

క.	అమరపతి ఖాండవమునకు
రమణను వైశ్రవణు చైత్రరథమునకు సమా
నముగా దీనిని భూభా
గమునను రచియించె నొక్కొ కమలజుఁడు దయన్.	8

వ.	అని దాని రమణీయభావంబుఁ బొగడుచుఁ జనుదెంచి యవ్వనంబు సొచ్చునప్పుడు.	9

చ..	అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్జిత కుసుమాక్షతావళులు సేసలు వెట్టినయట్లిరెరి సం
పత దళినీనినాదమృదుభాషల దీవన లొప్ప నిచ్చుచున్.	10

వ.	మఱియును	11

క.	కాఱడవిఁ బఱచు మృగముల
నూఱడకం దిగిచి డస్సియున్నతని శ్రమం
బాఱఁగ నెడఁ బరితాపము
దీఱఁగ బైవీచె నన్నదీపవనంబుల్.	12

మానిని

ఏచి తనర్చి తలిర్చిన క్రోవుల నిమ్మగు ఠావుల, జొంపములం
బూచిన మంచియశోకములన్, సురపొన్నలఁ, బొన్నల, గేదఁగులం,
గాచి బెడంగుగఁ బండిన యాసహకారములం గదళీతతులం
జూచుచు, వీనుల కింపెసఁగన్ వినుచున్ శుకకోకిల సుస్వరముల్. 13

కవిరాజవిరాజితము

చని చని ముందట నాజ్య హవిర్ధృత సౌరభ ధూమలతాతతులం
బెనఁగిన మ్రాఁకుల కొమ్మలమీఁద నపేతలతాంతము లైనను బా
యని మధుపప్రకరంబులఁ జూచి జనాధిపుఁ డంత నెఱింగెఁ దపో
వన మిది యల్లదె దివ్యమునీంద్రునివాసము దానగు నంచు నెదన్. 14

వ. ఇట్లు హృదయసుఖావహం బగుచున్న యవ్వనంబులో నరిగి యరిగి యనవరత మహాద్విజ పఠ్యమాన వేదధ్వనులను, నవిచ్ఛిన్న హూయమానాగ్నిహోత్ర స్వాహాశబ్దంబులను, ననేకమునిగణ ప్రణీత వచన విషయ విభాగ వినిర్ణయ న్యాయనిపుణ విద్వత్సభాసంభాషణఘోషంబులను, బ్రతిపక్ష దుర్భేద ప్రమాణ విచార్యమాణ వేదార్థ మీమాంసక గోష్ఠీవివాద నాదంబులనుంజేసి మ్రోయుచు, యజ్ఞప్రయోగప్రవీణులయిన యాజ్ఞికులకును విహితానుష్ఠానాసక్తులయిన యనుష్ఠాతలకును నధికతపోనిరతులయిన మహా తపోధనులకును నివాసం బయిన పుణ్యనదీతీరంబునఁ దద్దయు రమ్యంబయి గంగాతీరంబయిన నర నారాయణస్థానంబునుంబోలె జగత్పావనంబైన కణ్వ మహాముని యాశ్రమంబు గని యందు. 15

సీ. శ్రవణ సుఖంబుగా సామగానంబులు
 చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులయుఁ గరికర
 శీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణముల చల్లనిగా డ్పాసపడి దానిఁ
 జెంది సుఖం బున్న సింహములయు
భూసురప్రవరులు భూతబలుల్ తెచ్చి
 పెట్టు నీవారాన్న పిండతతులు
తే. గడఁగి భక్షింప నొక్కటఁగలసియాడు
చున్న యెలుకలుఁ బిల్లుల యొందు సహజ
వైరివర్గంబులయు సహవాస మపుడు
సూచి మునిశక్తి కెంతయుఁ జోద్య మంది. 16

వ. 'ఇక్కాశ్యపుం డైన కణ్వమహామునీంద్రునకు నమస్కరించి వచ్చెద, నా వచ్చునంతకు నందఱు నిచ్చోటన యందునది' యని 17

చ. వలయు నమాత్యులం దగినవారల నుండఁగఁ బంచి ధారుణీ
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజదళాయతాక్షి సం
కుల మిళితాళినీల పరికుంచిత కోమలకుంతలన్ శకుం
తల యను కన్యకం గనియెఁ దన్మునివల్లభు మందిరంబునన్. 18

వ. 'అదియును ననంతవిలాసంబున జయంతుండ పోని దుష్యంతు నెఱింగి', యతిసంభ్రమంబున నాసనార్ఘ్య పాద్యాది విధులం బూజించి, కుశలం బడిగియున్న నక్కన్యకం జూచి దుష్యంతుండిట్లనియె. 19

ఉ. 'క్రచ్చఱ వేఁట వచ్చి యిట కణ్వమహామునిఁ జూచి పోవఁగా
వచ్చితి; మెందుఁ బోయిరొకొ వా?' రనినన్ విని యాలతాంగి 'వా
రిచ్చటనుండి యీక్షణమ యేఁగిరి కానకుఁ బండ్లు దేర; మీ
వచ్చు టెఱింగిరేని జనవల్లభ! వారును వత్తు రింతకున్. 20

వ. 'వారు వచ్చునంతకు నొక్కముహూర్తం బుండునది' యనిన విని యక్కోమలి వినయంబునకు మృదుమధుర వచనంబులకు సంతసిల్లి, దానిం గన్యకగా నెఱింగి మనోజరాజ్యలక్ష్మియుంబోని దాని సర్వలక్షణ లక్షితంబు లయిన సర్వావయవంబులుం జూచి సంచలిత హృదయుం డై 'నీ వెవ్వరి కూతుర? విట్టి రూపలావణ్య విలాసవిభ్రమగుణసుందరి విందుల కేల వచ్చి'? తని యడిగిన నది యిట్లనియె. 21

**శకుంతల దుష్యంతునకుఁ దన జన్మక్రమం బెఱింగించుట**

క. 'జగతీవల్లభ! యే న
త్యగణిత ధర్మస్వరూపుఁ డని జనములు దన్
బొగడఁగ జగదారాధ్యుం
డగు కణ్వమహామునీంద్రునాత్మజ' ననినన్. 22

చ. 'ఇది మునికన్య యేని మఱి యేలొకొ యీలలితాంగియందు నా
హృదయము దద్దయుం దవిలె; నిప్పలు కింకమ నమ్మనేర న
య్యెద; విజితేంద్రియుం డనఁగ నిమ్మునిఁ బాయక విందు' నంచుఁ దా
నిది కలరూ పెఱుంగ నవనీపతి యుత్సుకుఁ డయ్యె నాత్మలోన్. 23

వ. ఇట్లు దుష్యంతు డాశకుంతలజన్మం బెఱుంగ వేఁడి వెండియు దాని కిట్లనియె. 24

తే. ఉత్తమాశ్రమనిష్ఠితుఁ డూర్ధ్వరేతుఁ
డైన కణ్వమహాముని యనఘ చరితుఁ;
డట్టిముని కెట్లుఁ గూతుర వైతి? దీని
నాకు నెఱుఁగంగఁ జెప్పుము నలిననేత్ర. 25

వ. అని యడిగిన నారాజునకు శకుంతల యిట్లనియె. 26

క. 'ఇక్కమలాక్షి శకుంతల
యెక్కడియది? దీని జన్మ మెవ్విధ?' మని త
మ్మొక్క మునినాథుఁ డడిగిన
నిక్కాశ్యపు లర్థిఁ జెప్పి రేను వినంగన్. 27

వ. 'నా జన్మ ప్రకారంబు మాయయ్య యమ్మునికిం జెప్పిన విధంబు చెప్పెదఁ జిత్తగించి విను'మని యాదుష్యంతునకు శకుంతల యిట్లనియె. 28

సీ. అనఘుఁడు రాజర్షియై తపశ్శక్తిమై
బ్రహ్మర్షిభావంబుఁ బడసియున్న
సన్మునీశ్వరుఁడు విశ్వామిత్రుఁ డతిఘోర
తపము సేయుచున్నఁ దత్తపమున
కెంతయు వెఱచి దేవేశ్వరుఁ డప్సరో
గణములలో నగ్రగణ్య యైన
దాని మేనక యను ధవళాక్షిఁ బిలిచి 'వి
శ్వామిత్రుపాలికిఁ జని తదీయ
ఆ. ఘోరతపము చెఱిచి కోమలి! నా దైన
దేవరాజ్యమహిమఁ దివిరి నీవు
గావు' మనిన నదియుఁ గడు భయంపడి యమ
రేశ్వరునకు మ్రొక్కి యిట్టు లనియె. 29

చ. వనజభవప్రభావుఁడగువాని వసిష్ఠు నపత్యశోక మ
న్వననిధిలోన ముంచిన యవారితసత్త్వుఁడు నిన్నుఁ దొట్టి యీ
యనిమిషు లెల్లవానికి భయంపడుచుండుదు రట్టియుగ్రకో
పనుకడ కిప్పుడేఁగు మని పాడియె యిప్పని నన్నుఁ బంపఁగన్. 30

ఉ. అమ్ముని యల్లి చూచుదును నాక్షణమాత్రన గోత్రధారుణీ
ధ్రమ్ములు వ్రయ్యు, నయ్యుసుము దక్కఁగ నంబుధు లింకు, మూఁడులో
కమ్ములు దిర్దిరం దిరుగు, గాడ్పు చలింపఁగ నోడు, నుగ్రతం
బమ్మినయట్టి కోపపరుపాలికి భామలు వోవ నోడరే. 31

వ. 'అయినను నానేర్చువిధంబున నమ్మునివరుచిత్తంబు మెత్తన చిత్తజాయత్తంబగు నట్లుగాఁ జేసెద'నని వాసపు వీడ్కొని మేనక తనకు మందమలయానిలంబు దోడుగాఁ జనుదెంచి, హిమవత్పర్వత ప్రదేశంబునం దపంబు సేయుచున్న విశ్వామిత్రు తపోవనంబు సొత్తెంచిన. 32

క. చల్లని దక్షిణ మారుత
మల్లన వీతెంచెఁ దగిలి యా లలనాధ
మ్మిల్ల కుసుమాంగరాగస
ముల్లసనసుగంధి యగుచు మునివరుమీఁదన్. 33

వ. అంత. 34

చ. అనిమిషకాంతయున్ నవలతాంత విభూషణ లీల నల్లన
ల్లన వనకేళి లాలస విలాసగతిం జనుదెంచి ముందటం
గనియె మహామునిప్రవరుఁ గౌశికుఁ గౌశిక చిత్తభీతి సం
జనన మహాతపశ్చరణ సంయతచిత్తు నిరస్తచిత్తజున్. 35

క. అంబుజలోచన గని విన
యంబున నమ్మునికి మ్రొక్కి యనురాగముతో
డం బుష్పాపచయ వ్యా
జంబున విహరించుచుండె సఖులం దానున్. 36

చ. అలసత యొప్పఁగాఁ దరుణి యమ్మునివల్లభు మ్రోల నున్న స
మ్మిళిత సుగంధబంధుర సమీరవశంబునఁ దూలి బాల పై
వలు వెడలన్ బయల్పడియె వల్గుకుచంబులుఁ గక్షయుగ్మమున్
లలితకృశోదరంబుఁ దరళత్రివళీయుత రోమరాజియున్. 37

క. అందుఁ దనదృష్టి నాటుడుఁ
గందర్ప నిశాత సాయకంబులు పెలుచున్

డెందముఁ గాఁడిన ధృతి సెడి
కంది మునీంద్రుండు దానిఁ గవయం దివిరెన్. 38

వ. మేనకయు విశ్వామిత్రు నిష్టంబునకుం దగిన కామోపభోగంబులం బెద్దకాలంబు రమియించిన నయ్యిద్దఱకు నిక్కన్యక పుట్టిన, దీని మాలిని యను నొక్కయేటి పులినతలంబునం బెట్టి మేనక దేవలోకంబునకుం జనియె; విశ్వామిత్రుండును దపోవనంబునకుం జనియె, నంత నమ్ముని ప్రభావంబున. 39

ఆ. చెలఁగి లేవ నేడ్చు చిఱుతకదానిఁ గ్ర
వ్యాదఘోరమృగము లశనబుద్ధిఁ
బట్టకుండఁ జెట్టుపలఁ గప్పి రక్షించు
కొని శకుంతతతులు గూడియుండె. 40

వ. అంత నేము శిష్యగణంబులతోడ సమిత్కుసుమ ఫలాహరణార్థం బక్కడకుం జని, యమ్మాలినీ పులినతలంబున శకుంతరక్షిత యై యున్న కూఁతు నత్యంత కాంతిమతి నవనీతలంబున కవతరించిన తరుణ శశిరేఖయుంబోని దాని నెత్తుకొని వచ్చి, శకుంతరక్షిత యగుటఁ జేసి శకుంతల యను నామం బిడి కరంబు గారవంబునం బెనిచితిమి. 41

మధురాక్కర
తనర జనకుండు నన్నప్రదాతయును భయత్రాత
యును ననఁగ నింతులకు మువ్వ రోగిన గురువులు; వీర
లనఘ! యుపనేత మఱియు నిరంతరాధ్యాపకుండు
ననఁగఁ బురుషున కియ్యేవు రనయంబును గురువులు. 42

వ. 'అనం బరఁగిన శాస్త్రార్థంబున నేము దీనికి భయత్రాతల మగుటంజేసి గురుల; మిదియును మాచే నభివర్ధిత యగుటం జేసి మాకు హృదయానందని యైన కూఁతు'రని కణ్వమహామును లమ్మునికిం జెప్పిన విధంబంతయు సవిస్తరంబుగా శకుంతల చెప్పిన విని దుష్యంతుం డాత్మగతంబున. 43

**దుష్యంతుండు శకుంతలను వివాహంబు సేసికొనఁ గోరుట**

చ. ఇది మునినాథ కన్య యని యెంతయు నిస్స్పృహవృత్తి నున్ననా
హృదయము రాజపుత్త్రి నని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం

పద నెఱిఁగించినన్ మదనబాణపరంపర కిప్పుడుండ నా
స్పద మయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్. 44

వ. అనుచు మదనాతురుం డయి దుష్యంతుండు దనయం దక్కోమలియనురాగం
బుపలక్షించి యిట్లనియె. 45

క. ఈ వల్కలాజినములకు
నీ వన్యఫలాశనముల కీ విటపకుటీ
రావాసములకు నుచితమె
నీ విలసిత రూపకాంతి నిర్మలగుణముల్. 46

ఉ. ఈ మునిపల్లె నుండు టిది యేల కరం బనురాగ మొప్పఁగా
భామిని! నాకు భార్య వయి భాసురలీల నశేషరాజ్య ల
క్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందితేందుపా
దామలతుంగహర్మ్యముల హారిహిరణ్మయ కుట్టిమంబులన్. 47

సీ. 'బ్రాహ్మంబు దైవంబుఁ బరఁగ నార్షంబుఁ బ్రా
జాపత్యమును రాక్షసంబు నాసు
రంబు గాంధర్వంబు రమణఁ బైశాచంబు
నను నెనిమిది వివాహములయందుఁ
గడుఁ బ్రశస్తములు సత్క్షత్త్ర వంశ్యులకు గాం
ధర్వ రాక్షసములు ధర్మయుక్తి;
నీకును నాకును నెమ్మిఁ బరస్పర
ప్రేమంబు గాముండు పెంపఁదొడఁగెఁ

ఆ. గాన యెడయుఁ జేయఁగా నేల? గాంధర్వ
విధి వివాహ మగుట వినవె యుక్త'
మనిన లజ్జఁ జేసి యవనత వదన యై
యాలతాంగి యిట్టు లనియెఁ బతికి. 48

క. కరుణానిరతులు ధర్మ
స్వరూపు లింతకు మదీయ జనకులు సనుదెం
తురు; వారు వచ్చిన నీ కి
చ్చిరేని పాణిగ్రహణము సేయుము నన్నున్. 49

వ. అనిన దానికి దుష్యంతుం డి ట్లనియె. 50

తే. తనకు మఱి తాన చుట్టంబు, తాన తనకు
గతియుఁ, ద న్నిచ్చుచోఁ దాన కర్త యనఁగ
వనజనేత్ర! గాంధర్వవివాహ మతి ర
హస్యమును నమంత్రకమును నగుచు నొప్పు 51

వ. అని దుష్యంతుండు గాంధర్వవివాహ స్వరూపంబు చెప్పి శకుంతల నొడం బఱిచిన నది యి ట్లనియె. 52

చ. నరనుత! నీ ప్రసాదమున నా కుదయించిన నందనున్ మహీ
గురుతర యౌవరాజ్యమునకున్ దయతో నభిషిక్తుఁ జేయఁగా
వరము ప్రసన్నబుద్ధి ననవద్యముగా దయసేయు నెమ్మితో;
నిరుపమకీర్తి! యట్లయిన నీకును నాకును సంగమం బగున్. 53

వ. అనిన విని శకుంతల కెంతయు సంతోషంబుగా దాని కోరిన వరంబిచ్చి, గాంధర్వ వివాహంబున నభిమతసుఖంబు లనుభవించి, యక్కోమలి వీడ్కొని 'నిన్నుఁ దోడ్కొని రా నస్మత్ప్రధానవర్గంబుఁ గణ్వమహాముని పాలికిం బుత్తెంచెద' నని యూఱడ నొడివి దుష్యంతుండు నిజపురంబునకుం జనియె; నిట శకుంతలయుఁ దనచేసినదాని మునివరుండెఱింగి యలిగెడునో యని వెఱచుచుండె; నంత నమ్మహాముని వనంబుననుండి కందమూలఫలంబులు గొని చనుదెంచి, లలితశృంగారభావంబున లజ్జావనతవదనయు నతిభీత చిత్తయునై యున్న కూతుంజూచి, తన దివ్యజ్ఞానంబున నంత వృత్తాంతంబు నెఱింగి, క్షత్రియులకు గాంధర్వవివాహంబు విధిచోదితంబు యని సంతసిల్లి శకుంతల కి ట్లనియె. 54

## భరతుని జననము

తే. తల్లి! నీకులగోత్ర సౌందర్యములకుఁ
దగిన పతిఁ గంటి, దానికిఁ దగఁగ గర్భ
మయ్యె, నీదు గర్భమున వాఁ డఖిలంభువన
వహన మహనీయుఁ డగు చక్రవర్తి సుమ్ము. 55

వ. 'నీధర్మచరితంబునకు మెచ్చితి. నీ కోరిన వరం బిచ్చెద వేఁడు' మనిన శకుంతలయు 'నాచిత్తంబెప్పుడు ధర్మువునంద తగిలియుండను,నాకుద్భవించెడు

పుత్త్రుండు దీర్ఘాయురారోగ్యైశ్వర్య బలసమన్వితుండును వంశకర్తయుఁగాను వలయు' ననిన నమ్మహాముని కరుణించి దాని కోరిన వరంబిచ్చి, యథాకాల విధుల గర్భసంస్కార రక్షణంబులు సేయించి యున్నంత, వర్షత్రయంబు సంపూర్ణం బైన, శకుంతలకు భరతుండుదయించి కణ్వనిర్వర్తిత జాతకర్మాది క్రియాకలాపుం డయి పెరుఁగుచుఁ గరతలాలంకృతచక్రుండును, చక్రవర్తిలక్షణ లక్షితుండును, సింహసంహననుండును, దీర్ఘబాహుండును, ననంతజవసత్త్వ సంపన్నుండును నై పరఁగుచు. 56

మ. అమితోగ్రాటవిలోనఁ గ్రుమ్మరు వరాహవ్యాళశార్దూల ఖ
ద్గమదేభాదులఁ బట్టి తెచ్చి ఘనుఁడై కణ్వాశ్రమోపాంత భూ
జములం దోలిన కట్టుచుం బలిమియై శాకుంతలుం డొప్పె వ
న్యమదేభంబుల నెక్కుచుం దగిలి నానాశైశవక్రీడలన్. 57

# 2. ఉత్తర గోగ్రహణము

**– తిక్కన సోమయాజి**

**కవిపరిచయం**

తిక్కన కవిత్రయంలో ద్వితీయుడైన కవిత్వంలో మాత్రం అద్వితీయుడైన కవి. తిక్కన 13వ శతాబ్దమునకు చెందినవాడు. నెల్లూరును పరిపాలించిన మనుమసిద్ధి ఆస్థానంలో ఆస్థానకవిగా, మంత్రిగా ప్రసిద్ధికెక్కాడు. తిక్కన యజ్ఞం చేసి 'తిక్కన సోమయాజి' అయ్యాడు. మనుమసిద్ధి తాత భాస్కరుడు గుంటూరు విభుడు. తండ్రి కొమ్మన దండనాథుడు, తల్లి అన్నమ్మ. ఇతని శిష్యుడు కేతన రచించిన దశకుమార చరిత్రలో తిక్కనకు సంబంధించిన పలు అంశాలు ఉన్నాయి. తిక్కన పెదనాన్న కుమారుడు ఖడ్గతిక్కన.

సంస్కృతంలో వేదవ్యాసుడు 'జయ' అనే పేరుతో రచించిన మహాభారతాన్ని నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు తెలుగులోనికి అనువదించారు. మహాభారతంలో మొత్తం 18 పర్యాలున్నాయి. అందులో విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు తిక్కన 15 పర్వాలను ఒంటిచేతి మీదుగా అనువాదం చేశాడు.

తిక్కన భారతానువాదంతోపాటు నిర్వచనోత్తర రామాయణం రచించాడు. దానిని మనుమసిద్ధికి అంకితం చేశాడు. దీనితపాటు విజయసేనం, కవిసార్వభౌమ ఛందస్సు, కృష్ణశతకం కూడా తిక్కన రచనలుగా పేర్కొనబడుతున్నాయి.

తిక్కనకు కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు అనేవి బిరుదులు.

తిక్కన తన భారతానువదాన్ని హరిహరనాథునికి అంకితం చేశాడు.

తిక్కన కవిత్వంలో తెలుగుదనం మూర్తీభవిస్తుంది. తిక్కన రసాభ్యుచిత బంధాన్ని శ్రీనాథుడు అనుసరించాడు. సందర్భోచిత పదప్రయోగం, వర్ణనా సామర్థ్యం చిత్తవృత్తి ప్రకటనం, పాత్రపోషణ నైపుణ్యం, తెలుగు నుడికారాల సొంపు, అల్పాక్షరాలలో

అనల్పార్థ స్ఫూర్తి తిక్కనలో కనిపిస్తాయి. తిక్కనది నాటకీయ శైలి. ఆయన కవిత్వంలో తెలుగుదనం మూర్తీభవిస్తుంది.

ఈ పాఠ్యభాగం తిక్కన రచించిన ఆంధ్రమహాభారతంలో విరాటపర్వం చతుర్థాశ్వాసం లోనిది.

నవమినాడు ఉదయమే దుర్యోధనుడు భీష్మద్రోణ కృపాదులైన వీరులందరూ కలసిరాగా అపారసైన్యంతో ఉత్తర దిక్కున విరాటుడి గోవులను ముట్టడించి మరలించి హస్తినవైపు తోలుకొని పోసాగాడు. ఆ విపత్తును గవాధ్యక్షుడు రాజధాని అంతఃపురంలో ఉన్న భూమింజయుడిని దర్శించి విన్నవించుకొన్నాడు. అపార కురు సైన్యాన్ని ఎదుర్కొని గోధనాన్ని రక్షించుకొని అభిమానాన్ని కాపాడుకొమ్మని కోరాడు. ఉత్తరుడు కౌరవులపై దాడికి వెడలటానికి సిద్ధమయ్యాడు. కాని, తగిన సారథి నగరంలో లేదని తెలిసికొన్నాడు. సారథని సమకూర్చండని ఆజ్ఞాపించాడు. తగిన సాఅథియే కనుక దొరికితే భీష్మ, ద్రోణ, దుర్యోధన, కర్ణ, కృప, అశ్వత్థామాది వీరులందరితో రణరంగంలో పార్థుడివలె పోరి గోవులను అవలీలగా తిరిగి తెస్తానని ప్రకటించాడు.

ఆ మాటలు ద్రౌపది విన్నది. అప్పుడేర్పడిన క్లిష్టపరిస్థితిని పేడిరూపంలో ఉన్న అర్జునుడికి చెప్పింది. అజ్ఞాతవాసకాలం ఆ రోజుతో ముగుస్తున్నదని గమనించి పార్థుడు తన సారథ్యానికి ఉత్తరుడు ఒప్పుకొనేటట్లు చేయమని ద్రౌపదిని కోరాడు. ఆమె బృహన్నల రథచోదన శక్తిని గురించి ఉత్తరకు చెప్పి, ఆమె అన్న అయిన ఉత్తర కుమారుడికి నివేదించుమన్నది. పూర్వం ఖాండవ దహన సమయంలో బృహన్నల అర్జునుడి రథసారథిగా ఉండి విజయాన్ని సాధించటానికి తోడ్పడ్డాడని ఉత్తర ఉత్తరకుమారుడితో చెప్పింది.

భీష్మాదులతో యుద్ధ చేయబోతూ పేడివాడిని సారథిగా పెట్టుకొంటే అపహాస్యాల పాలౌతానని ఉత్తరుడు మొదట ఒప్పుకోలేదు. కాని, ద్రౌపది కూడా బృహన్నల నేర్పును చెప్పి ఒప్పించటంతో అంగీకరించాడు. ఉత్తర బృహన్నల రథసారథిగా ఉండటానికి కోరింది. ఉత్తరుడు కూడా అతడిని ఆహ్వానించాడు. అర్జునుడికి తనకూ విజయాన్ని కలిగించమని కోరాడు. బృహన్నల రథాన్ని ఆయత్తం చేశాడు. ఉత్తర తనకు కురువీరుల తలపాగాలను బొమ్మపొత్తిళ్ళగా తెచ్చి పెట్టుమని బృహన్నలను కోరుకొన్నది. అందుకు బృహన్నల అంగీకరించాడు. ఉత్తరుడు రథమెక్కాడు. ఉత్తర దిశగా రథాన్ని పోనిచ్చాడు. బృహన్నల.

ముందుకు సాగిపోతున్న కౌరవుల మహాసైన్యాన్ని తిక్కన ఒక ఉద్యానవనంలా పోల్చాడు. అలా ఉన్న కౌరవుల మహాసైన్యాన్ని ఉత్తరుడు చూడటంతో మన పాఠ్యభాగం ప్రారంభమౌతుంది.

* * *

## పాఠ్యాంశం

సీ. అభినవ జలధర శ్యామంబు లగునెడ
లాకు జొంపంబుల ననుకరింప,
సాంధ్యరాగో పమచ్ఛాయంబు లగుపట్లు
కిసలయో త్కరములఁ గ్రేణిసేయ
రాజమరాళ గౌరము లగు చోటులు
తఱచుఁ బూఁబొదల చందంబు నొంద
హారిద్రరుచి సమానాకృతు లగు తావు
లడరెడు పుప్పొడు లట్లు మెఱయఁ,

తే. గలయ నెగసి ధరాధూళి లలిత వనము
దివికి నలిఁగాఁపు వోయెడు తెఱఁగు దాల్ప
గోగణము ముంగలిగ నేల గోడివడఁగ
నడచు కౌరవరాజ సైన్యంబుఁ గనియె. 1

క. కని యుత్తరుండు గరుపా
ఱిన మేనును, దలఁకు మనము, ఱిచ్చవడిన చూ
పును నై, తొట్రు పడుచు, ని
ట్లనియె, దిగులుసొచ్చి యాబృహన్నలతోడన్. 2

శా. "భీష్మద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు, దుర్యోధన
గ్రీష్మాదిత్య పటు ప్రతాప విసరాకీర్ణంబు, శస్త్రాస్త్ర జా
లోష్మ స్ఫార చతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రం, బుదగ్రధ్వజా
ర్చిష్మత్వాకలితంబు సైన్య మిది యేఁ జేరంగ శక్తుండనే? 3

క. అకృతాస్త్రుఁడ బాలుఁడఁ గా
ర్ముక విద్యాప్రౌఢిమై నిరూఢు లయిన యీ

శకుని జయద్రథ దుర్ముఖ
వికర్ణకర్ణాది యోధ వీరుల కెదురే! 4

క. ఇ ట్టగు టెఱుఁగక వచ్చితి
మెట్టొకొ! మనభంగి, వీర లిందఱును గడున్
బెట్టిదులు, మనకు మార్కొను
నట్టికొలఁది గాదు, భీతి యడరెడుఁ దోడ్తోన్. 5

ఉ. "కౌరవసేనఁ జూచి వడఁకందొడఁగెన్ మదితోన మేను, నీ
వూరక పోవుచున్కి యిది యొప్పునె? యిప్పటి భంగిఁ జూచిన
న్వీరల నేను మార్కొనమి నిశ్చయ, మట్లగుటన్ రయంబునన్
దేరు మరల్పు, ప్రాణములు దీ పన మున్ వినవే బృహన్నలా!" 6

వ. అనిన దరహసితవదనుం డగుచు శతమఖ తనయుం డతని కి ట్లనియె. 7

చ. అసదృశలీలఁ బొల్చు రథికావలి మీఁదఁ జనంగ వెఱ్టినే
మసలక యామిషంబు గొని మార్గము వట్టిన తుచ్ఛసైన్యముల్
వెసఁ జని ముట్టి గోధనము వేగ మరల్తుము గాక యిమ్మెయిం
బసు లటు వోవగా మరలఁ బాడియె నీకు నరేంద్ర నందనా! 8

ఉ. అంతిపురంబులోనఁ గలయంగన లెల్లను నెమ్మనంబులన్
సంతసమందగాఁ బసులఁ జయ్యనఁ దెచ్చెద నంచుఁ బూని, నీ
వెంతయు మేటివై, యరద మెక్కి రయంబున వచ్చి, యిచ్చటన్
దంతి తురంగ సద్భట కదంబముఁ జూచి కలంగు టొప్పునే"! 9

ఆ. అనిన పలుకులకు బృహన్నలఁ గనుగొని
యెలుఁగు వడఁక నాతఁ డిట్టు లనియెఁ
"బసుల దయ్య మెఱుఁగుఁ బడతుల సంతోష
మేల నాకు? ననికిఁ జాల నేను." 10

వ. అనవుడు 11

చ. "తనభుజ శక్తియున్ రిపుల దర్పము నేర్పడఁ జూచి చూచి యె
ట్లును దెగకున్నఁ బోక, యిది లోకము చక్కటి, శూరులైన దీ

నిని మది మెచ్చ, రీబలము నీదెస దేఱియుఁ జూడ దింతకున్
మును భయహేతు వైన విధముం దగఁ జెప్పుము నాకు నిత్తఱిన్. 12

సీ. దెసలు బీఁటలు వాఱఁ దివురు చిందంబుల
కోలాహలములకుఁ గుదియఁబడక
యురవడి సేసలు దెరలఁ బైఁ దోఁ తెంచు
ధూళి పెల్లడరినఁ దూలపోక
చతురంగబల మతి సాంద్రతఁ గవిసిన
యగ్గలికమునకు బెగ్గడిలక
శస్త్రాస్త్రములు రథ్యసారథి వర్మాంగ
తతి నాటు తఱచునఁ దల్లడిలక
తే బహువిధంబులఁ బగతుర బరవసమున
నెత్తెఱంగునఁ గలుగుక్రం దెల్ల నోర్చి
నిల్చి గెల్చిన సత్కర్తి నెగడుఁగాక
దవ్వు దవ్వుల నిట్లైన నవ్వరెట్లు?" 13

చ. అను దివిజేంద్ర నందనున కమ్మనుజేంద్ర తనూజఁ డిట్లనున్
"వినుము, త్రిగర్తవాహినులు విక్రమసంపద సొంపుమీఱ, గో
ధనములఁ బట్టినం, బతి యుదగ్రత సైన్యము లెన్ని యన్నియుం
గొని యటు వోయెఁ, గాన మనకుం బురి బాసట లేర య్యెవరున్.
14

తే. ఒంటిఁ దలపడి కురుసేన నోర్చు వాఁడ
నే? యి దేటికి వెడమాట లిట్టులాడ?
వారు గానకముందఱ తేరు దోలు
కొని రయంబునఁ బురి కరుగుటయ నీతి" 15

వ. అనిన బార్థుండు పార్థివ నందనున కి ట్లనియె. 16

క. "వెగడొంది యిట్లు వలుకఁగ
నగునే? పగతురు ప్రమోద మందఁగఁ బసులన్
దిగవిడిచి పురజనంబులు
తెగడంగా మగిడిపోక దీనత గాదే! 17

వ. అట్లుంగాక. 18

మ. నను సైరంధ్రి గడంగి పేర్కొనియె. దానం బెంపుమైఁ బిల్చి తో
డని తోడ్తెచ్చితివీ వు, బంటుతన మట్లగ్గించి పౌరాలి దీ
వన లిచ్చెం, దుదిఁ బోయి కౌరవులు గోవర్గంబుఁ గొంపోవఁగాఁ
గని, యేఁగ్రమ్మతి రిత్తవోదునె? భయోత్కంపంబు నీ కేటికిన్? 19

తే. "చిత్తవృత్తి యొక్కించుక చిక్కఁబట్టు
మిపుడు కౌరవసైనికు లెల్లఁ జూచి
వెఱఁగు పడ వేగమును లావు వెఱవు మెఱయఁ
గదుపుఁ బెట్టించి పోదము క్రమ్మఱంగ." 20

వ. అనుచు వివ్వచుండు గడంగి తేరు వోవనిచ్చుటయు నాననంబు పల్ల టిల్ల, మానసంబు దల్లడిల్ల నాభూవల్లభు కుమారుండు. 21

క. "దవ్వుల విఱిగినఁ బౌరులు
నవ్వుదురటె! మేలు మేలు! నను నాఁగకు, నీ
క్రొ వ్వఖుగదేనిఁ దలపడు
మెవ్విధిఁ జనితేని" యనుచు నెత్తిన భీతిన్. 22

క. శరములు శరాసనము న
య్యరదముపై డిగ్గవిడిచి యతిరభసమునన్
ధరణికి లంఘించి వెసం
బురిదెసకును లజ్జ వీటిఁబోవం బాఱెన్. 23

వ. ఇట్లు వాఱినం దనమనంబునం గుత్సించుచు బీభత్సుండు యోగ్యంబుల పగ్గంబుల నొగల ముడిచి రథంబు డిగ్గనుఱికి లంబకేశ భారుండను నాందోళిత రక్తాంబర యుగళాంచలుండును నగుచు నతని వెనుకం బఱచు సమయంబున నిలిచి కనుంగొను కౌరవబలంబునందు. 24

ఉ. అజ్ఞులు కొంద ఱప్పు డపహాసము సేయుచు గూఢరూపరే
ఖాజ్ఞత లేమిఁ దద్వికృత కాయము మీదను దృష్టి నిల్పఁగాఁ,
బ్రాజ్ఞులు మూర్తి సౌమ్యతయు, బాహుల దీర్ఘతయుం, భటత్వత
త్త్వజ్ఞతయున్ గతిస్ఫుర దుదాత్తతయుం గని సంశయంబుతోన్. 25

తే. “ఆఁడు చందంబుఁ బురుష సమాకృతియను
గలిగి యున్నది యొప్పు నూష్మలత సొంపు
వికృత వేషాకృతంబులై వెలయ కితఁడు
నివుఱు గవిసిన మెఱయని నిప్పు వోలె. 26

ఉ. బాహులచాయయున్ గమనభంగియు నర్జును నట్లు, దీన సం
దేహము లే దితండు తన తేజము డాఁపఁగ మర్త్యభూమి భృ
ద్గేహము నందుఁ బేడి యనఁ గీడ్పడి యుండెనొ? కాక యీ కురు
వ్యూహము తోడి కయ్యమున కొండొకరుం డిటు లొంటి వచ్చునే? 27

చ. విరటుఁడు దక్షిణంబునకు వీరుల సారథులన్ నిజాజికై
పురిఁగల వారి నెల్లఁ గొనిపోయిన, నొండులు లేమిఁజేసి యు
త్తరుఁ డిట వచ్చుచుండి, యరదంబు దగం గడపంగ నెవ్వరుం
దొరకొనకున్నఁ దా నితనిఁ దోడ్కొని వచ్చినవాఁడు సూడఁగన్. 28

చ. పరి సనుదెంచి గోగణముఁ బట్టి రనన్ విని, పిన్న గాన మీఁ
దరయక రాజనందనుఁ డహంకృతిమైఁ బఱతెంచి, సైన్యవి
స్ఫురణముఁ జూచి, భీతిఁ దనబుద్ధి గలంగినఁ బాఱఁజొచ్చె, ని
ప్పురుషుని శౌర్యసంపదయు భూరిబలంబు నెఱుంగఁ దేమియున్.”29

వ. అనుచు నిశ్చయ రహిత హృదయలగుచుండ శుండాల రయ లీలాసమరేఖంబగు గమనంబునం బురుహూత పుత్రుండు పదశతమాత్ర ప్రదేశ పలాయితుం డైన భూమింజయు నెయిది పట్టుకొనిన నతండు. 30

సీ. వెలవెలఁ బాఱుచు వెగడొందు, బెదవుల
తడి యాఱ నెంతయుఁ దల్లడిల్లు,
జల్లన నంగంబు లెల్ల నిండఁ జెమర్చుఁ,
బదములుఁ గరములుఁ గుదియ వడఁకు,
హృదయంబు తటతట నదరంగఁ బెలుకుఱు,
దీనదృష్టుల మోముఁ దేఱిచూచు,
నెలుఁగు గద్గదికఁ దొట్రిల నేడ్చు, విడు మని
ప్రార్థించు మాటఁ గీడ్పాటు దోప,

తే. “నిష్కశతశుద్ధ హేమంబు నిర్మలోజ్జ్వ
లాష్ట వైడూర్యములఁ దురగాఢ్య రథముఁ
గరటి దశకంబు నొకయూరుఁ బురము సొచ్చి
నపుడ యిచ్చెద నీ”కను నార్తుఁడగుచు. 31

క. నాతోడి ప్రేముడిం గడు
నాతురయై యెదురుచూచు నంబకు చేతః
ప్రీతిగఁ జని యాయమఁ బొడ
సూతుం బోనీగ దే విశుద్ధ చరిత్రా!” 32

వ. అని మఱియు నానావిధ దీనాలాపంబులం బ్రార్థించు చుండం బార్థుండు నగుచు నతనిం దేరు సేరం దెచ్చి. 33

చ. “వెఱవకు మన్న! పోటు కురువీరులతోడ నశక్యమేని న
త్తెఱఁ గది యేల నీ కుడుగు తేరికి సారథి గమ్ము నాకుఁ జి
చ్చుఱపిడు గెట్టు లట్టడరి శూరుల మొత్తము నుగ్గు సేసెదం,
బఱపెద సేన, రాజుధృతిఁ బాపెద. గోవులఁ గ్రమ్మఱించెదన్”. 34

క. అనుచు నొడఁబాటు లేకు
న్నను, నయ్యుత్తరుని నొగల నడుకొన నిడి, తా
నును రథ మెక్కి రథికుఁ డయి
చనియె నరుఁడు జమ్మి సేర సమ్మదలీలన్. 35

వ. ఇట్లు సవ్యసాచి నిక్షిప్తాయుధం బయిన శమీవృక్ష సమీపంబున కరుగు నవసరంబునం గ్లీబరూపచ్ఛన్నుండయ్యును బ్రస్ఫురణ విశేషభీషణుం డగు నతనిం గనుంగొని కౌరవసైనికులు గలంగిన మనంబుల తోడ నివ్వెఱపడి యుండ వారలం గనుంగొని తోఁచు నుత్పాతంబుల నాలోకించి గురుం డిట్లనియె. 36

క. “మాసె నభోమణి, నక్కలు
కూసెం, గలయంగ దెసలకుం బలు చాయల్
సేసెం బఱమొయిళు లడిరి,
మ్రోసెం దమయంతఁ దూర్యము లపధ్వనులై. 37

క. ఇగ్గజములు మిన్నకయును
మ్రొగ్గెడు, నుత్తమ తురంగములు బాష్పజలం
బగ్గలము విడుచుచున్నవి.
తగ్గెడుఁ గారణము లేక తడఁ బడి పడగల్. 38

క. దగ్ధము లైనట్టులు స
మ్యగ్ధైర్యము లెడలె, మండె నాయుధ చయముల్,
దిగ్భ్రమం బెసఁగె, నసం
దిగ్ధము మన కాజి యగుట, దీనికిఁ దగఁగన్. 39

క. మొన లొఱపుగఁ దీర్చికొనుడు,
తన తన వాహనము లాయుధము లెల్ల జనం
బును నను వు సేసికొనుఁ, డో
పిన యంతయుఁ గాచికొనుఁడు బెదరక పసులన్." 40

వ. అని చెప్పి తానప్పు డర్జును నెఱింగినవాఁడు గావున నతనికి నజ్ఞాతవాస సమయభంగం బగునో యను భయంబున సురనదీ సూను వదనంబు వీక్షించి సన్నవాఱ నిట్లనియె. 41

చ. "వెరవరి గాక వీఁడు కురువీరులకుం బొడసూపువాఁడె? య
చ్చెరు, వొక మ్రానిపేర నిట సేరఁగ వచ్చుచు నున్నవాఁ, డహం
కరణమ కాని యొండొకటి గానఁడు, మూర్తివిశేష మారయన్
సురపతియట్ల, వీనిమదిచొప్పది యెట్లొ యెఱుంగ నయ్యెడున్". 42

క. అనిన విని యెఱిఁగికొని యా
తని మది సందియము మాన్పఁ దలఁచి నరేంద్రుం
గనుగొనుచు నతనితోఁ జె
ప్పినభంగి నిగూఢవృత్తి భీష్ముఁడు వలికెన్. 43

క. "తలఁపఁగ రిపులకు నిమ్మగు
కొలఁది గడచి వచ్చితిమి, యకుంఠిత బాహా
బలము నెఱపఁ దఱి యయ్యెను
జలింపవల దింక మనకు శత్రుల వలనన్." 44

వ. అనవుడు నాచార్యుం దయ్యర్థంబు గనికొని పార్థునకు సమయభంగంబువలని
సంకటంబు లేకునికి మనంబునం బ్రియం బంది మొగంబునం దోపనీయక
పుయిలోట దక్కి యిట్లనియె. 45

శా. "సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్. 46

ఉ. ఈతని తోడి కయ్యమున కియ్యకొనం దగుపార లస్మదీ
యాతతసేనలోఁ గలుగు టారయ సంశయ, మెల్లభంగి గో
వ్రాత నివర్తనంబు సుకరంబ కిరీటి, కితండు రుద్రునిం
బ్రీతునిఁ జేసె నా వినమె? పెంపెసలారెడు బాహుసంపదన్. 47

వ. అను పలుకు లాకర్ణించి కర్ణుండు కటకటంబడి కుంభసంభవున
కిట్లనియె 48

ఉ. "పాండవ పక్షపాతమునఁ బల్కుదు నోరికివచ్చినట్లు, ని
న్నొండన రామిఁ జేసి, యిది యొప్పునె? కౌరవసేన కెల్ల నొ
క్కండవ మేటి, వీబలము గర్వముఁ గుందఁగ నిట్లు శత్రుదో
శ్చండిమ కోహటించితి, నిజంబునకున్ నరుఁ డింతయెక్కుఁడే! 49

ఆ. అతఁడు వచ్చెనేని, నస్మచ్ఛిలీముఖ
పాత చలిత హృదయ పద్ముఁ జేసి,
వెగడు పఱచి, యోధవీరులకెల్ల ను
త్సవ మొనర్తు బాహుదర్ప మొప్ప". 50

వ. అనిన విని సుయోధనుండు రాధేయున కిట్లనియె. 51

ఆ. "తప్పఁబలికితీవు, చెప్పెద విను, మితఁ
డర్జునుండ యేని నడవి కేఁగి
భ్రాతృయుతము గాఁగఁ బండ్రెండు వత్సర
ములును నంద నిలువ వలయు మగుడ. 52

క. ఒరుఁ డయ్యేనేని మామక
శరాసనక్షిప్త దీప్తసాయక పంక్తిం
బరిమార్చెద వ్రేల్మిడి న
చ్చెరువుఁ బ్రమోదంబు నొంది సేనలు వొగడన్." 53

క. అనుపలుకులకును భీష్మం
డను ద్రోణుండు ద్రోణసూనుఁడును గృపుఁడును మే
లని యియ్యకొనిరి హృదయా
ననురూపము లయిన తెలుపు లాస్యముఁ బొందన్. 54

# 3. ఘోష యాత్ర

-ఎఱ్ఱా ప్రెగ్గడ

**కవిపరిచయం**

ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్రయంలో మూడవవాడు. ఇతడు క్రీ.శ. 1328 నుండి 1349 వరకు అద్దంకిని రాజధానిగా చేసికొని కృష్ణా, గోదావరీ మధ్య భాగమును ఏలిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి. తల్లిదండ్రులు పోతమాంబ, సూరనార్యుడు. ఎఱ్ఱన నియోగి బ్రాహ్మణుడైన శివభక్తుడు. పాకనాటి సీమలోని గుడ్లూరు నివాస స్థలము. వృద్ధాప్యమున చదలవాడలో కొంతకాలముండెను. ఇంటి పేరు కూడా చదలవాడే అయింది.

ఎఱ్ఱన శ్రీ మదాంధ్రమహాభారతము అరణ్యపర్వమున కొంత భాగమును పూరించి మహాకవి పదవిని పొందాడు. నన్నయ తిక్కన్నలతోపాటు కవిత్రయములో ఒకడై నిల్చాడు. శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు అనేవి ఇతనికి ఉన్న బిరుదులు. నృసింహ పురాణము, రామాయణము, హరివంశములను రచించెను. ఉక్తి వైచిత్రి ఎఱ్ఱన రచనలో కన్పిస్తుంది.

ఘోషయాత్ర అను ప్రస్తుత పాఠ్యాంశము ఎఱ్ఱన కృతమైన శ్రీ మదాంధ్ర మహాభారత అరణ్యపర్వములోని పంచమాశ్వాసం నుండి గ్రహింపబడింది.

పాండవులు ద్వైతవన సరోవర తీరంలో ఉన్నారు. వారు వనవాస క్లేశాలను అనుభవిస్తున్నారనీ, వారి ముందు కౌరవసంపదను ప్రదర్శించి వారికి మరింత దుఃఖాన్ని కలిగించాలనీ దుష్టచతుష్టయం పన్నాగం పన్నింది. ద్వైతవనంలో ఉన్న గోవులు క్రూరమృగ బాధకు గురి అవుతున్నాయనీ, తత్క్షణమే ప్రభువులు వాటికి రక్షణ కల్పించాలనీ సమంగుడనే గోపాలుడి ద్వారా నాటకమాడించి ఒక వసతిని కల్పించారు. దానిని నమ్మిన ధృతరాష్ట్రుడు మొదట దుర్యోధనాదులను గోరక్షకు పంపటానికి

అంగీకరించలేదు. శకుని నచ్చచెప్పిన తరువాత ఎట్టకేలకు సమ్మతించాడు. అయితే, ఆ వనంలోనే నివసిస్తున్న పాండవుల కెటువంటి కీడును తలపెట్టవద్దని హెచ్చరించాడు. దుర్యోధనుడు దాని కంగీకరించి ఘోషయాత్ర ప్రకటించాడు. మహావైభవంగా, అట్టహాసంగా, సకుటుంబ పరివారంగా దుర్యోధనాదులు ద్వైతవనం చేరి వసతిగృహాలుగా డేరాలు వేయించి, వినోద విలాసాలతో కాలం గడపసాగారు. గోవుల సంపదను పరిశీలించి తగిన భద్రతలను ఏర్పాటు చేశాడు. ధార్తరాష్ట్రుల సంపదలనూ, వైభవాలనూ చూచి పాండవులూ, ద్రౌపదీ మనసులలో బాధపడాలని వారి పన్నాగం.

ద్వైతవనంలో దుర్యోధనాదులు కొంతకాలం మృగయా వినోదం సాగించారు. ద్వైతసరోవర ప్రాంతంలో ధర్మరాజు యజ్ఞదీక్షితుడై ఉన్నాడని తెలిసి, సరోవరానికి ఆవలి ఒడ్డున క్రీడాగృహాలను నిర్మించటానికి భటులను ఆజ్ఞాపించాడు. ఆ ప్రయత్నాన్ని కొందరు గంధర్వులు అడ్డగించారు. చిత్రసేనుడనే గంధర్వరాజు క్రీడార్థం కల్పించుకొన్న కొలను కాబట్టి, ఇతరులు దానిని ఉపయోగించరాదని హెచ్చరించడంతో పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.

**(మహాభారతం ఆరణ్యపర్వం – పంచమాశ్వాసం 383వ పద్యం నుండి 436వ పద్యం వరకు)**

మ. 'బలియుండా ధృతరాష్ట్రసూనుఁడు మహాబాహుండు దుర్యోధనుం
డలఘుం డీ కమలాకరంబునకుఁ గ్రీడార్థంబు గౌతూహలం
బెలయంగాఁ బ్రియకామినీ సహితుఁడై యేతెంచుచున్నాఁడు మీ
ర్వల దిందుండఁ, దొలంగి పొం' డనవుడున్ వారుద్ధతక్రోధులై. 1

వ. ఒండొరువుల మొగంబులు సూచి పెలుచ నవ్వి వారల కిట్లనిరి. 2

క. 'ఎదిరిం దన్ను నెఱుంగఁడు
మదమునఁ బ్రాణంబు దనదుమానముఁ గోల్పో
మదిఁ దలఁచినాఁడు మీన్నృపుఁ
డిది యేటికిఁ జెనఁటిచెయ్వు లిన్నియు నిచటన్. 3

వ. బుద్ధిమంతుల రై యూరక చనుట లెస్స యునుం' దనినం గ్రమ్మఱి చని వారు కురుపతికిం దద్వచనంబుల తెఱం గంతయుం జెప్పుటయు, నతండు రోషావేశవివశుండై తమ్ముల దొరలం జూచి, 'మీ రిందఱు మీమీ సైన్యంబుల

తోడం గూడి కడంగి, దుర్వినీతులైన గంధర్వులగర్వంబు మాన్పి సరోవరంబాక్ర మించునది, వారికి సహాయుం డయి సురగణసమేతంబుగ నింద్రుడు సనుదెంచె నేనియు నవలీల జయించునది' యని నియోగించిన. 4

క. అతుల చతురంగసేనా
న్వితు లయి ధృతరాష్ట్రసుతులు నిరతిశయ రయో
ద్ధత సింహనాదబధిరీ
కృతదిఙ్ముఖు లగుచుఁ జనిరి గినుక యెలర్పన్. 5

వ. ఇట్లు సనుదెంచు కురువీరుల కడ్డంబు వచ్చి కొందరు గంధర్వులు ప్రియ పూర్వకంబుగా 'నిట యేల వచ్చెదరు? మీకు మాతోడి విద్వేషం బేటికి? నిలువుం' డనినం బెలుచ నార్చి సేనాగ్రచరులు వారలమీఁదం బ్రచురశస్త్రాస్త్ర పాతంబు సేయం దొడంగినం, దొలంగి చని, యా గంధర్వులాక్షణంబ చిత్రసేనునకు నంతయుఁ జెప్పి పుచ్చినం, బ్రబల రోషరంజితాననుండై యతండు. 6

క. 'చనుఁడు రయంబున నాదు
ర్జనులం గౌరవులఁ బొదివి సమయింపుఁడు మీ'
రని బహుసహస్ర సంఖ్యులఁ
బనిచెను గంధర్వవరులఁ బ్రకటితబలులన్. 7

వ. ఇట్లు పనిచిన. 8

ఉ. ఆయత కుంత కార్ముక గదాసి పరశ్వధ శూల పట్టిసా
ద్యాయుధ ఘోరహస్తులు గులాచలతుంగతనుల్ ప్రచండతే
జోయుతు లా వియచ్చరులు శూరతమై నడతెంచి బల్విడిం
గో యని తాఁకి రుగ్రరణకోవిదులై కురురాజసైన్యమున్. 9

వ. ఇవ్విధంబున గంధర్వులు బెట్టిందంబుగాఁ గిట్టి నొప్పింపం దొడంగినం గలంగి దుశ్శాసనాది కౌరవులు ససైన్యంబుగాఁ దెరలి దుర్యోధనుచేరువకుం బఱచినఁ, గర్ణుండొక్కరుండ సుస్థిరుండయి నిలిచి గంధర్వుల నిలువరించి భల్లార్ధ చంద్రప్రముఖ బహులబాణపాతంబులం దదీయదేహంబులు ఖండించుచు నిమిష మాత్రంబునఁ జిత్రసేను సైనికశతంబుల రూపుమాపుటయు,

మఱియుం బైపై గంధర్వులు శతసహస్ర సంఖ్యులు తోఁతెంచినం బృథివి యెల్లను గంధర్వమయం బై నట్లుండె నప్పుడు. 10

చ. శకునియుఁ దమ్ములుం బ్రబలసైన్యముతో నడతేర నాహవో
త్సుకమతి యై సుయోధనుఁడు సూతతనూభవుఁ డున్నచోటికిం
బ్రకటభుజోగ్రతం గడఁగి బల్విడిఁ దద్రిపుకోటిఁ దాఁకినన్
సకల జగద్భయంకరలసత్సమరోత్సవ మయ్యె నయ్యెడన్. 11

క. కొండొకసేపునకు మహో
ద్దండనృపానేకఘోరతరవిశిఖవ్యా
ఖండిత శరీరులై ధృతి
ఖండితముగఁ బల్లటిలిరి గంధర్వులనిన్. 12

**చిత్రసేనుం డను గంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము సేయుట**

క. గంధర్వులు దెరలుట విని
గంధర్వవిభుండు క్రోధకలుషితమయై
గంధగజము చందమున, మ
దాంధగతిం గవిసెఁ గౌరవానీకముపై. 13

వ. ఇట్లు గవిసి చిత్రసేనుండు. 14

శా. మాయాసంగరకోవిదుండు వికసన్మాయాస్త్రజాలంబులన్
వాయువ్యాప్తి యడంగ నర్కకిరణవ్రాతంబు రుద్ధంబుగాఁ
జేయం జొచ్చినఁ, ద్రెళ్ళెఁ దేరులు, కరుల్ శీర్ణంబు లయ్యెన్, దళ
త్కాయం బయ్యె హయాలి, గూలిరి భటుల్ కౌరవ్యసైన్యంబునన్. 15

క. పొదలి యొకని కొక్కనికిని
బదుగురుగఁ గవిసి పౌరవసేనం
బొదివి సమయింపఁ దొడఁగిరి
వదలక గంధర్వులని నవార్యోద్ధతులై. 16

వ. అవ్వియచ్చరుల విక్రమంబునకు నోర్వక బెదరి చెదరి కురురాజసైన్యంబు ధర్మనందనుం డున్న కందునకుఁ బాఱందొడంగె, నప్పుడు రాధేయుండ జేయుండై కులశైలంబునుం బోలెఁ దరలక నిలిచి గంధర్వులు గురియు

శరవర్షంబున మునుఁగుచుఁ దన యోపినంత పెనంగుచుండె, సోదర సౌబల సహాయుండై దుర్యోధనుండు గర్ణ సాహాయ్యంబు వదల నిలిచె, నంత ననంత సత్త్వులైన గంధర్వు లనేకులు సుట్టుముట్టి. 17

ఉ. కొందఱు సూతు, నశ్వములఁ గొందఱు కొందరు చాపదండముం
గొందఱు చక్రయుగ్మకముఁ, గొందఱు విస్ఫురితాతపత్రముం
గొందఱు కూబరంబు, మఱి కొందఱు కేతువుఁ, గొంద ఱక్షమున్
దందడిఁ దున్మివైచి విరథత్వ మొనర్చిరి సూతసూతికిన్. 18

వ. ఇట్లు విరథుం డయి కర్ణుండు వికర్ణురథం బెక్కి రణభూమికిం దొలంగి చనియె, దుర్యోధనుండు విముఖుండు గాక పరబలంబు మార్కొని పెనంగం దొడంగినం గినిసి చిత్రసేనుండు వానిం దలపడి తదీయస్యందనంబు రాధేయు రథంబు నట్లు భగ్నంబుగాఁ జేయించి, విరథుండగు నమ్మహీవిభుంగేశాకర్షణంబున నేలం బడవైచి పెడేకేలు గట్టి సింహనాదంబు సేసినం, దక్కిన గంధర్వులుం గనుకనిం బేర్చి యతని వనితా జనంబులను, దత్సోదరు లగు దుశ్శాసన దుర్విషహ దుర్ముఖ వివంశతి చిత్రసేన విందానువిందులను, దత్తనూభవులను, దదీయమంత్రులను బట్టి బంధించి చిత్రసేనున కొప్పించి, రంతఁ బెఱ కౌరవులును బౌరులు నమాత్యులుం జెదరి యాక్రోశించుచుం బఱచి, ధర్మపుత్త్రు శరణు సొచ్చి యిట్లనిరి. 19

మ. 'ఘనబాహాబలదుర్నివారమహిమన్ గంధర్వవీరుల్ సుయో
ధనుఁ దత్కాంతలఁ దత్సహోదరుల బంధప్రాప్తులం జేసి కై
కొని వేపోవుచు నున్న వారదె, రిపుక్షోభంబు గావించి, నీ
యనుజవ్రాతముఁ గావవే కరుణ నిండారంగా రజోత్తమా!' 20

వ. అని కృతాంజలులై పలుకుచున్న వారింజూచి భీమసేనుండు ప్రహసితాననుం డగుచు ధర్మపుత్రునికిట్లనియె. 21

క. 'మనకుఁ జులుకనయ్యె, మన చేయుపనియ గం
ధర్వవరులు గూడి తగ నొనర్చి,
రింత లెస్స యగునె
యే బారమును లేక యూరకుండ మనల నొందె జయము. 22

తే. పుట్టుగల్లరియై పాపములకు నెల్ల
దిట్టయై లోకములచేతఁ దిట్టు వడిన
కట్టిఁడికి నిట్టి కష్టంబుగా నొనర్చి
తగ విధాతృఁడు చతురుఁ డై నెగడె నేఁడు. 23

మ. విపరీతస్థితి నొంది ఘోరవిపినోర్వీవాసులై నిత్యదుః
ఖపరాధీనతఁ దూలి రంచు మనలన్ గర్వోద్ధ తస్వాంతుఁ డై
యపలాపింగఁగ వచ్చి దుర్ణయపరుం డా ధార్తరాష్ట్రుండు దో
షపరీతాత్ముఁడు దత్ఫలంబు గుడిచెన్ సత్యంబు సామాత్యుఁడై. 24

వ. వానిదెసం గృప సేయ వల' దనిన ననుజునకు నగ్రజుం డిట్లనియె. 25

క. 'అకట! యిది పరుషవాక్యము
లకు సమయమె? శరణు సొచ్చి లఘుభావముతో
వికలగతి నున్న కౌరవ
నికరమునకుఁ గరుణ సేయ నీకుం దగదే! 26

వ. ఏకాన్వయజాతు లైన వారికి నర్థనిమిత్తం బైన భేదం బొక్కొకమాటు ప్రవర్తిల్లు, నంతన చేసి సహజస్నేహంబు దప్పనేరదు, జ్ఞాతిజనంబులు దమలో నెట్టివారైన నొప్పుం గాని, యన్యులవలనం బరిభవంబు దొదరినప్పుడు దా రొం డొరుల జేకొన కునికి లోక నింద్యంబు, దుర్యోధనుండు దుర్వినీతుం డైనను సభార్యుండయి పరులచేత బట్టు వడియె. దీని నుపేక్షించిన మనకుం గులహాని యగు, నదియునుం గాక శరణాగత రక్షణంబు రాజమాత్రుండగు వాని కెల్ల ధర్మంబు, నీయట్టి బాహుబలసంపన్నునకు నిట్టి సుకర్మంబు కర్తవ్యం బని వేఱ చెప్పనేల? లెమ్ము! నీవును నీ తమ్ములు నిమ్ముల రథంబు లెక్కి సర్వాయుధ సన్నద్ధులై చని సుయోదను చెఱ దలఁగుం' దనినఁ బవననందనుండు ధర్మనందనున కిట్లనియె. 27

సీ. 'అనుమాన మొక్కింతయును లేక యలిగి జ
        లంబులఁ ద్రోచె, విషంబు వెట్టె
గృహదాహ మొనరించె, విహితదురోదర
        కపటుఁడై రాజ్యంబు నపహరించె,

జనులెల్లఁ జూడంగ వనజాక్షిఁ బాంచాలిఁ
దలవట్టి యీడ్పించె, వలువ లొలువఁ
బనిచెఁ, బుట్టినకోలె మనకు నక్కట సుయో
ధనుఁ డెగ్గు సేయని దినము కలదె?

ఆ. వానిచోఁత లొకటి యేనియుఁ దలఁపవు,
నీవు మనుజనాథ! కేవలంపుఁ
గరుణ పూని యుండు దరయ నెప్పుడు నిట్టు
లైన మనకుఁ గార్యహాని గాదె?' 28

వ. అని పూర్వవైరస్మరణ కలుషితుండై పలికిన నతనికి నజాతశత్రుండు సాంత్వన పూర్వకంబుగా నిట్లనియె. 29

ఆ. 'కావరయ్య యనినఁ గరము దుర్బలుఁ డైనఁ
జెనసి యోపినంత సేయు ననిన,
నూరకుందునయ్య? యుత్తమ శూరుండు
దీనజనుల యున్న తెఱఁగు సూచి. 30

క. శరణం బని వచ్చిన భీ
కర శత్రువు నయినఁ బ్రీతిఁ గావఁగ వలయుం
గరుణాపరుల తెఱం గిది
యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్. 31

వ. ధృతరాష్ట్రసూనుండు భవదీయ బలశౌర్యంబులపేర్మి యెఱుంగుం గావునఁ దన్ను నవశ్యంబును విడిపింతు రని మనదెస బద్ధాశుం డై యుండు, నిది మనకుఁ బుణ్యంబును గీర్తియుం జేకొను సమయంబు, ని న్నింత నిర్బంధింప వలవ, దేన యరుగుదు, నిప్పుడు యజ్ఞదీక్షితుండనై యున్న వాఁడఁ గావున నాకుం జనరాదు, మీరు వేగఁ జని గంధర్వులం బ్రియపూర్వకంబుగా ననునయించి సుయోధను విడిపించునది, సామవచనంబులం దీరకున్నఁ బరాక్రమంబున నైనం బ్రతివీరుల నోర్చి కార్యంబు దీర్చునది, నా చేయు జన్నంబు సఫలంబు సేయుం' డనిన భీముం డెట్టకేనియు నియ్యకొనియె, నర్జునుండును ధర్మరాజు పనుపు గైకొని కురురాజు చెఱ దలఁగఁ బ్రతిజ్ఞసేసె, నకుల సహదేవులు నుత్సాహసమేతు లయి, రన్నలువురు నాముక్త కవచులు,

నా బద్ధ తూణీరులు, నాకలిత కార్ముకులు, నారూఢ రథులు నయి, యగ్రజు వీడ్కొని, యతిత్వరితగతి నడచినం గౌరవసైన్యం బంతయు వారిం గూడుకొని సింహనాదంబులు సెలంగం జనియె, నిట్లరిగి వారలు గంధమాదనంబున కయి చనుచున్న యవ్వియచ్చరానీకంబుం గూడ ముట్టిన. 32

క. కని గంధర్వులు గ్రమ్మఱి
ఘనులం బాండవుల నగ్నికల్పులఁ దేజో
ధనుల నమరేంద్రసదృశుల
ననఘుల మార్కొనిరి ప్రకటితాటోపమునన్. 33

ఉ. అగ్రజువాక్యముల్ దలఁచి యర్జునుఁ డప్పుడు వారితోడ న
త్యుగ్రత దక్కి యెంతయుఁ బ్రియోక్తుల నిట్లను 'మీకు మాయెడన్
విగ్రహ మేల? నెయ్యమున విడ్వుఁడు కౌరవరాజుఁ, బార్థివ
ప్రాగ్రసరుండు ధర్మసుతు పన్పిది, మీకు నలంఘ్య మిత్తఱిన్. 34

వ. అనిన నతనికి గంధర్వు లిట్లనిరి. 35

తే. 'ధర్మజుఁడు మాకుఁ బ్రభుఁడె? యా ధర్మతనయు
నాజ్ఞ నే మేల యొనరింతు? మనిమిషేంద్రుఁ
డొక్కరుఁడ మమ్ము శాసింప నొడయఁ, డన్యు
లెందు నెవ్వరైనను భయ మేమి మాకు?' 36

వ. అనిన వివ్వచ్చుం డవ్వియచ్చరుల నుపలక్షించి, 'మునుమున్న తెగువకుం జొర నేల? యని ప్రియంబును ధర్మంబునుంగాఁ బలికితి, నెట్లును మీరు సామసాధ్యులరు గాకునికి దోఁచుచున్నయది గావున నుగ్రంబయిన విగ్రహంబున దుర్యోధను విడిపింతు' నని వారల మీఁద నశితవిశిఖ ప్రకరంబులు ప్రయోగించె, నా గంధర్వులు నతనిపైఁ బటుబాణ వర్షంబులు గురిసి, రిట్లా నలువురు ననేక గంధర్వశత సహస్రంబులతో నతిఘోర సమరంబయ్యె, నందు. 37

తరలము
కదిసి యర్జునుతేరు భగ్నముగా నొనర్పఁ దలంచి పె
ల్లొదవి ఖేచరకోటి గ్రమ్ముటయుం బురందర నందనుం

డదయుఁడై పది లక్షలం బ్రళయాగ్ని కల్పుల దివ్యులం
గదన శూరుల నిర్దహించెఁ బ్రకాండదివ్యశరార్చులన్. 38

మహాస్రగ్ధర

ఘనకోదండోగ్రమౌర్వీ క్వణ మఖిలనభో గహ్వరాభోగభాగం
బున నాపూర్ణంబుగా ను ఋ్బనఁ గవలు మరు త్పుత్త్రుడుం దీవ్రనారా
చ నితాంతాపాతలీలా సరభసగతులై శత్రువీరవ్రజంబుం
దనుమం దచ్ఛోణితంబుల్ దొరఁగి మడువులై తొట్టె నయ్యుద్ధభూమిన్. 39

వ. ఇట్లు కౌంతేయులచేతం బీడితులై గంధర్వులు దుర్యోధనాదుల చెఱ లేమఱక గొనుచు గగనంబునకు నెగసి త్రోచిపోవ నుంకించిన నెఱింగి సవ్యసాచి రయంబున నతినిబిడబాణ జాలంబులం జేసి దిఙ్నభోమార్గంబులు నీరంధ్రంబులుగాఁ గప్పిన నగ్గగనచరులు వలలోనం జిక్కిన పులుఁగులుం బోలెఁ బోవ నేరక శరపంజరంబునం జిక్కియు నుక్కుసెడక యన్నలువురమీఁద వివిధాయుధ ప్రకరంబులు ప్రయోగించిన. 40

మ. అవి యెల్లం దనుమాడి క్రీడి ఘనరోషాభీలుఁడై శాతభ
ల్లవితానం బదరించినం దలలు డొల్లం గాయముల్ మింట నుం
డి వడిం గుంభినిఁ గూలఁగా రుధిరవృష్టిం గాలువల్ వాఱఁగా
దివి గంధర్వుల క్రం దడంగె జగ ముద్వేగంబునం బొందఁగన్. 41

వ. మఱియును నర్జునప్రయుక్తంబైన ఆగ్నేయాస్త్రంబు దావాగ్ని నీరసవిపినంబు దహించు తెఱంగున గంధర్వనివహంబు నీఱుసేయం దొడంగినం గినిసి చిత్రసేనుండు భీమసేనానుజుమీఁదంబటు గదాదండంబువైచిన నతండు దాని నేడు తునియలుగా సేయుటయు, గంధర్వరాజు మాయాబలంబున నంతర్హితుండై. 42

క. నలువురు పార్థుల నత్యు
జ్జ్వల శరవర్షముల ముంచి జలధరముక్రియం
బెలుచన గర్జిల్లుచు మొ
క్కలుఁడయి తన విక్రమంబుఁ గడఁకయుఁ జూపెన్. 43

ఆ. దాని నుఱక యింద్రసూనుండు గాండీవి
శబ్దభేదు లయిన సాయకములఁ

జిత్రసేను సర్వగాత్రంబు భేదించి
యొక్క మాత్రలోన నుడిపెఁ గడఁక. 44

వ. ఇట్లు నొచ్చి గంధర్వనాయకుండు రణసంరంభంబు విడిచి యర్జును జేరంజని తనపొడ సూపి నిలిచిన, నవ్వీరుండును నాత్మసఖుం డయిన ఖేచరపతి తెఱంగు సూచి సంహృతాస్త్రుం డయ్యె; వృకోదరాదులును సమరవిరామంబు నొందిరి; వారలందఱుఁ దమ తమ రథంబుల మీఁదన యుండి యొండొరులఁ గుశలంబు లడిగి; రప్పు డర్జునుండు చిత్రసేనున కి ట్లనియె. 45

క. 'వీరోత్తమ! నీ కిమ్మెయి
వైరము దగునయ్య? కౌరవప్రకరముతోఁ
గౌరవపతి విడువుము త
ద్దారానుజనుత సమన్వితంబుగ నెమ్మిన్.' 46

వ. అనిన నతం డర్జునున కిట్లనియె. 47

సీ. 'ఈ దురాత్ముఁడు మిమ్ము నివ్వనంబున నితాం
తాయాసపీడితు లైనవారిఁ
బరమధర్మాత్ముల భార్యాసమేతుల
నపహసింపఁ దలంచి యరుగుదెంచె;
నింతయు నెఱిఁగి సురేంద్రుండు గలుషించి
యనుజవధూసహాయాన్వితముగఁ
బాపవర్తను వీనిఁ బట్టి తెమ్మని నన్నుఁ
బనిచిన వచ్చితిఁ బార్థ! వినవె;
తే. శక్రుపాలికి నిదె కొని చనుచున్న
వాఁడ; నీ వింక నొం దన వలదు వినుము!
మత్సఖుండవు గావున మత్సరంబు
నలుకయును లేను నీదెస ననఘ! నాకు.' 48

తే. అనిన నర్జునుఁ డతని కిట్లనియె 'నీ సు
యోధనుఁడు మాకు వినుము సహోదరుండు
గాన యీతని విడుచుట కర్జ; మిదియ
ధర్మజున కెంతయును ప్రమోదంబు సేఁత. 49

చ. అమరవరేణ్యు పన్పయిన, నావల యెయ్యది యైన, నిప్డు ధ
ర్మమహితుఁడైన ధర్మజుసమక్షమునం దెఱిఁగించి, యాతఁడే
క్రమమున నెద్ది సెప్పె నది గైకొని చేయుము; నీవు మత్ప్రియా
ర్థము చనుదెమ్ము' నావుడును దాని కొడంబడి చిత్రసేనుఁడున్. 50

**చిత్రసేనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చి దుర్యోధను విడిచిపెట్టి పోవుట**

వ. వారలుందాను ధర్మజుకడకుం జనిన, నయ్యజాతశత్రుండు చిత్రసేను నతి ప్రియంబునం బూజించి, 'మహాత్మా! యీ సుయోధనుండు సానుజామాత్యుం డయి మీచేత వధియింపం బడకునికి మేలయ్యె మీ కారణంబున మా వంశంబునకు కొండొకహాని వొందదయ్యె; వీఁడెట్టి యపరాధంబు సేసినను, నదియంతయు సహించి మాకుంగా వీని విడువవలయు' నని ప్రార్థించిన, నతం 'డట్ల కాక' యని దుర్యోధనాదుల నందఱ విడిచి పాండుపుత్త్రుల నామంత్రణంబు సేసి, దివంబున కరిగి తత్ప్రకారంబు సకలంబును నింద్రునకు నివేదించిన, నింద్రుండును సమరనిహతు లయిన గంధర్వుల నమృతవృష్టిం జేసి బ్రదికించె; నిట యుధిష్ఠిరుండును ధార్త రాష్ట్రునకు బంధమోక్షణంబు గావించి వాని కిట్లనియె. 51

ఉ. 'ఎన్నఁడు నిట్టి సాహసము లింక నొనర్పకు మయ్య! దుర్జనుం
డన్నన సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ; గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ గైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్;
సన్నుత! దీని కొండొకవిషాదముఁ బొందకుమీ మనంబునన్. 52

వ. అని బుద్ధి సెప్పి వీడ్కొలిపిన, నతండును దీనాననుండగుచుం జనియె; ననుజ సహితుండయిన ధర్మతనయు ధార్మికత్వంబు ధౌమ్యాది భూసురులును దదాశ్రమ వాసులయిన మహామునులును బహువిధంబులఁ బ్రస్తుతించిరని వైశంపాయన వరిణతం బయిన కథావిశేషంబు సవిస్తరంబుగా. 53

క. రాజకులతిలక! భువనవి
రాజిత సితకీర్తి! దివిజరాజవిభవ! ని
ర్వ్యాజ పరాక్రమ! సకల ధ
రాజన సంపూజ్య! ధర్మరక్షణ దక్షా! 54

# 4. బాణాసురుడు శివుని సేవ

**- నాచన సోమన**

**కవి పరిచయం**

ఆంధ్ర వాఙ్మయంలో కవిత్రయంతో సమానుడుగా కొన్ని అంశాల్లో వారికంటె అధికుడుగా కీర్తింపబడిన ప్రజ్ఞావంతుడు నాచనసోమనాథుడు. 'ఆళికంబున అక్షిని దాచినట్టి సర్వజ్ఞుడ'ని చిన్నయసూరిచే స్తుతింపబడిన ప్రతిభావంతుడు. ఈ కవి నియోగి బ్రాహ్మణుడు. ఆపస్తంబ సూత్రుడు. భారద్వాజస గోత్రుడు. నాచన కుమారుడు.

సోమన కాలం గురించి పండితుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. కాలచర్చకు బుక్కరాయల దానశాసనంలోవిగా పండితులు ఊహించిన పాఠభేదాలు. సోమన రచించిందిగా చెప్పబడే వసంత విలాసకృతిపతి అయిన మాచయ బ్రహ్మయ జీవించిన కాలం ఆధారాలుగా తోస్తున్నాయి.

దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డి గ్రంథాధారాల్ని బట్టి నాచన సోమన కాల నిర్ణయం చేశారు. ఉత్తర హరివంశ ప్రథమాశ్వాసంలో (1-26) 'రచిత సమకాల బాహు విక్రమము చేత' అనే పద్య పాదం ఉంది. రచిత అంటే రచింపబడింది. సమ-2, కాల-6, బాహు-2, విక్రమ-1 అంటే 2621. ఎడమకు 1262. దీనికి సరియైన కాలం క్రీ.శ. 1340. ఇట్టి గూఢకాలం రేనాటి చోళుల శాసనాల్లో ఉందని రెడ్డిగారు తెలియజేశారు.

పై ఆధారాల్ని బట్టి చూస్తే నాచన సోమన క్రీ.శ. 1285 ప్రాంతంలో జన్మించి క్రీ.శ. 1355 ప్రాంతం వరకు జీవించాడనీ, అతడు క్రీ.శ. 1310-1340 వరకు గ్రంథకర్తగా ఉండి క్రీ.శ. 1344 నాటికి చాలా గ్రంథాల్ని రచించి మహాకవివర్యుడుగా వినుతికెక్కాడని చెప్పవచ్చు. అంటే సోమన ఎఱ్ఱన కంటె ప్రాచీనుడుకాడు సమకాలంవాడు కానీ కాస్త తరువాతివాడు కానీ కావచ్చు.

నాచన సోమన ఉత్తర హరివంశాన్నే గాక హరివిలాసం, వసంత విలాసం, ఆదిపురాణం, హరవిలాసం అనే గ్రంథాలు కూడా రచించినట్టు విమర్శకులఅభిప్రాయం. ఈ గ్రంథాల్లో ఉత్తర హరివంశం తప్ప తక్కిన గ్రంథాలేవీ లభ్యం కావడంలేదు కానీ

లాక్షణికులు నిర్దిష్ట గ్రంథాల్లోని పద్యాలను ఉదాహరిస్తుండంతో వాటిని సోమన కృతులుగా భావించవలసి ఉంది.

వెయ్యి బాహువులు కలిగిన బాణాసురుడు బలి చక్రవర్తి కుమారుడు. బాణాసురుడు అకుంఠిత దీక్షతో పరమశివుని ధ్యానించి ఆయన్ని మెప్పించి తనకు రక్షణగా శోణపురానికి తెచ్చుకున్నాడు. బాణాసుర వృత్తాంతాన్ని వైశంపాయనుడు జనమేజయునికి వివరించటంతో పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.

**(ఉత్తర హరివంశము, పంచమాశ్వాసం 1వ పద్యం నుండి 35వ పద్యం వరకు)**

క. శ్రీనిశ్రేయసకాంక్షా
నూనవ్రతభార దక్షిణోదార సప
ర్యానందిత చేతో ని
ధ్యాన తనుద్యుతి నవీన హరిహరనాథా. 1

కం. జనమేజయుఁ డిట్లనున
మ్మునితో హరివర్ణనంబు మును పలుమాఱున్
విని తనియదు మది గ్రమ్మఱ
వినఁ గోరెద ననుడు నతఁడు వేడుకతోడన్. 2

వ. మున్ను మురాంతకుండు చేసినలావు లెన్ని యెన్ని. 3

కం. ఏణాంకధరుఁడు దోడుగ
బాణుఁడు మొగరింప బాహుపంక్తి శతంబున్
క్షీణముగ నఱకి వానిం
బ్రాణముతోఁ బట్టివిడిచె బలిమథనుఁ డనిన్. 4

వ. అని మఱియుం గుమారుండు సహాయుం డగుటయుం బరమేశ్వరుండు నిత్య సాన్నిధ్యంబు చేయుటయుం గాత్యాయని జననీత్వంబు నొందుటయును నతనికి గాణాపత్యంబు గలుగుటయు నెఱింగించి యితవట్టునుం గలుగునతండు హరిచేత హతుం డయ్యె ననుటయు జనమేజయుండు తత్కథాశ్రవణకుతూహలి యైన నా వైశంపాయనుండిట్లనియె. 5

సీ. బలితనూజుం డైన బాణాసురుఁడు దొల్లి
కార్తికేయుని శూలి గారవించి

ముద్దాడునెడ సూచి మోదంబు ఖేదంబుఁ
బొడమ నెమ్మనములోఁ 'గొడుకు నిట్లు
పాటింపఁడేఁ దండ్రి పని యేమి? కటకటా
నాతండ్రి యుండిన నన్ను నిట్లు
పాటించు నిటమీఁదఁ బరమేశ్వరుఁడు తండ్రి
గాకున్న జన్మంబు కసటు వోదు.

గీ. తపము మెచ్చ కద్దేవుండు తండ్రి గాఁడు
గాన మెచ్చింతుఁ దపముచేఁ గాన లోన
నతనిఁ బంచేంద్రియంబుల కప్పగింతు
మానసంబున కట తెత్తు మదనహరుని. 6

మ. అని బాణాసురుఁ డీసు రోసము మమత్వాహంకృతు ల్యాసనం
బునకున్ దవ్వులవైచినిశ్చలగతిన్ ముగ్ధేందు చూడామణిన్
మునిసంఘాతశిరోభినీతచరణాంభోజాత సంభూత నూ
తనరాగద్యుతి భాసురుం బురహరుం దత్త్వస్థితిం జూచుచున్. 7

వ. ఇట్లని స్తుతియించు. 8

**బాణాసురుఁడు శివుని సేవించి వరములఁ బడయుట**

ఉ. 'కొలువఁగ నేర నిన్ను శతకోటివిభాకర తేజు దగ్గఱం
బిలువఁగ నేర నిన్ను మునిబృంద వివేకవిమర్శదూరునిన్
విలువఁగ నేర నిన్నుఁ బృథివీ వియదంతర భిన్ను నేమిటన్
నిలువఁ గదయ్య నా హృదయ నీరజకర్ణికపై మహేశ్వరా. 9

చం. 'కలఁగని వారునిన్ను మదిఁగొఁగిట నెత్తెడు వారు ముక్తికిం
దొలఁగని వారుగాఁ దెలియుదుం దలపోయుదు లోన నాసలున్
నలఁగవు హృత్పయోజ సదనంబునకు న్నినుఁ దెచ్చు నంతకున్
మలఁగఁగదే త్రికోణమణిమంటపదీపికపై మహేశ్వరా. 10

చం. 'ఒరసిరి నిన్నుఁ దర్కనికషోపలధా రల వన్నెఁ గాన రె
త్తరసిరి విశ్వముం గపిల యైనను నీదెస ముల్లు సూపఁగా
బెరసిరి బ్రహ్మముఖ్యు లగు పెద్దలు బచ్చులు వోలె నెల్లచో
నెరసిరి గాని నిన్నెఱుఁగ నేరరు నావశమే మహేశ్వరా. 11

గీ. అనుచు వినుతించుచున్న బాణాసురునకు
నంత కంతకు సంతోష మావహిల్ల
నంధకారాతి పొడసూపి యతనితోడ
'నడుగు మిచ్చెద వర' మన్న నతఁడు పొంగి. 12

కం. 'కడు వేడ్క తోడ నీకుం
గొడు కయ్యెడు నంతకంటెఁ గోర్కియుఁ గలదే
జడుఁ డనక నన్నుఁ గయికొని
గెడగూర్పుము నన్నుఁ గార్తికేయునితోడన్. 13

ఉ. నావుఁడు జంద్ర శేఖరుఁడు నవ్వుచుఁ బార్వతిఁ జూచి 'వీఁడు నీ
కోవనితా కుమారుఁడు గుహుం డితనిం దనతమ్ముఁ డంచు సం
భావన చేయుఁగాక యొకపట్టణ మిమ్ము విశాఖుఁ గన్న య
ప్పావకుఁ డేలు తద్రుధిర పట్టణ పార్శ్వమునం దలోదరీ.' 14

చం. 'పడగయు వాహనంబు నయి బర్హిణవల్లభుఁ డిక్కుమారునే
ర్పడఁ గదియుం గుమారుఁడును బాయని నెచ్చెలియై చరించు' నా
వుడు నచలేంద్రకన్య యభవుం గొనియాడె వరంబు చేత న
క్కొడుకు మదాంధుఁడై దివిజకోటికిఁ గీడొనరించె వెండియున్. 15

మ. గెలిచెం బూర్వన రేంద్రులం బఱపె నాగ్నేయావనీనాథులన్
నలఁచెన్ దక్షిణ రాజపంక్తిఁ జెఱిచెన్ నైరృత్యరాట్కోటి నా
వల వైచెన్ జరమాధిపాళి నడఁచె న్వాయవ్యభూపాలురన్
దొలఁగం బెట్టె నుదీచ్యపార్థివులఁ బోఁదో లెన్ హరాశేశులన్. 16

కం. గాణాపత్యము వడసెను
బాణుం డిలఁ గార్తికేయపర్వతకన్యా
స్థాణులు పొత్తున మనఁగా
శోణితనగరమున దనుజశోభనకరుఁడై. 17

వ. ఇట్లు త్రిభువనభవన భారభరణ పారీణభుజాస్తంభ విజృంభణంబున సరి లేక కసిమిరిగొను కరతలంబులతో నొక్కనాఁడు కాలకంధరుంజేరి యద్దేవునకుం బ్రణామం బాచరించి యిట్లనియె. 18

సీ. ఖురఖలీ నాఘాత కోలాహలంబుతో
నేమి నిర్ఘోషంబు నెఱప లేదు
నఖపుంఖరోచులు నారితో సంధించి
కర్ణావతంసంబు గడప లేదు
మణికిరీటకరోటి మంజీరములు రాయ
వీరమధ్యంబులు వ్రేయ లేదు
దంతిదంతావళదంతంబు లొరయ డా
కినుల వాచవులఁ జొక్కింప లేదు

గీ. లేదు ప్రతిభటబాహావలేప మహిమ
లేదు సంగ్రామమభీమకేలీ రవంబు
లేదు విక్రమక్రీడయు లేశ మైన
లేదు రాజ్యంబు గలిగియు లేదు ఫలము. 19

సీ. నిండారు తెగఁగొని నిగిడించు తూపుల
వైరిమర్మంబులు వ్రచ్చి వ్రచ్చి
బిగితంపు ముష్టి కంపితమైన యసిధార
విమత కంఠాస్థులు విఱిచి విఱిచి
అనువొంద నల్లార్చి యందంద పెనుగద
శత్రుదేహంబులు చదిపి చదిపి
చదల వమ్ముగఁ బర్వు శక్తిశూలాదులఁ
బగఱ పీనుఁగు లుర్విఁ బఱపి పఱపి

గీ. ఏదినంబును వృథవోవనీని కడిమి
యొదవఁ బోరాడునాట చెన్నొందె నేని
కూడు చవి యగుఁగాక నిష్ప్రోధ మైన
దర్పమూరక యూరింపఁ దరమె దేవ. 20

శా. దేవా కయ్యముతోడి వేడుక మదిం దీండ్రింప మర్త్యుండు నే
త్రోవం జేతులతీఁట వుత్తు నని కోరున్ దానవుం డైన నా
కీ వే చేతులు చేసి తీ కసిమి రిం కెట్లోర్తు నోర్తున్ రిపు
గ్రీవాఖండనమండన స్ఫురదసి క్రేంకారముల్ గల్గినన్. 21

కం. చేతుల కసి వోఁ గయ్యము
చే తవిలిన యట్టివిధము చింతించి ననున్
బ్రీతుంగాఁ గరుణింపుమ
యీతఱి నెన వోల్ప రామి యీఁగి మహేశా. 22

ఉ. నావుడు దేవదేవుఁడు మనంబున నించుక నవ్వి వానితో
'నీవు మయూరకేతనము నేలఁ బడం బొడగన్న యప్పు డా
శీ విషరాజసారభుజ! సిద్ధము యుద్ధము కల్మి దాని కేఁ
గావలియున్న చోటన యకారణ భంగ' మనంగఁ బొంగుచున్. 23

వ. నిజగృహంబునకు వచ్చి. 24

ఉ. పండిన సంతసంబు ముఖపద్మవికాసవిలాస మొంద బా
ణుండు సభాస్థలంబున మనోరథ సిద్ధి యెఱుంగఁ జేయఁ గుం
భాండుఁడు మంత్రివర్యుఁ దసురాధిపు నత్తఱిఁ జూచి నేఁడు నీ
వొండొక చందమై మిగుల నుబ్బెదు వచ్చిన మేలు చెప్పుమా.' 25

సీ. సహజవిగ్రహుఁ డైన శార్ఙ్గచే మెఱఁ గెక్కు
చక్రంబు ముద్దగాఁ జఱచి తొక్కొ
పాతాళగత మైనబంధు దానవకోటిఁ
బాటించి తలచూపఁ బంచి తొక్కొ
నీయింటి వాకిట నీలలోహితుకంటె
గుహునికంటె ఘనుండు గొలిచెనొక్కొ
మీతండ్రిచే గుజ్జుమెణకరి గొన్న భూ
గగనంబు లేలంగఁ గలిగె నొక్కొ

గీ. లవణ సాగరమధ్యంబు లావుతోడ
నేలునప్పుడు మన కెల్ల నింతబంటి
న న్నెఱుఁగ నీక నీకు నేఁ డున్న యునికి
నబ్బె నెబ్బంగి నిబ్బర మయిన యుబ్బు. 26

వ. అనుటయు నద్దనుజుం దమాత్యుని కి ట్లనియె. 27

చం. 'ఇనసమ తేజ! వింటివె యతీవ భుజక్రమవిక్రమక్రియా
ఘను లగుపోటుబంటులకు గాఢతరప్రతిపక్ష పక్ష భం
జనహృదయైకరంజన విశాల మహాహవమూల మైన య
య్యని మొనఁగాక కల్గునె సమంచిత కీర్తియు ధైర్యమూర్తియున్. 28

ఉ. 'లావున వైరిదర్పము వెల్వారక యేఁకరి యున్న చేతులన్
భావభవారిపాదములు పట్టి పరాక్రమకేళిఁ గోరితిన్
రావుననుండి యన్నమిలిటక్కెము గూలిన యప్డు సంగరం
బేవల నైనఁ గల్గ ననియెన్ హరుఁ డొండొక మోదమేటికిన్. 29

వ. అని మఱియును. 30

ఉ. నెయ్యము లేని సంగతియు నిక్కము లేని వచోవిలాసమున్
వియ్యము లేని వైభవము విందుల సందడి లేని ముంగిలిన్
దియ్యము లేని చాగమును ధీరత లేని యమాత్యకృత్యమున్
గయ్యము లేని శూరతయుఁ గైకొని యూరకమెచ్చ వచ్చునే.' 31

కం. అని మాట లాడు చుండఁగ
దనుజ కులాధీశు రాజ్యదర్పము వ్రేఁగై
తునిసినగతి హరు చెప్పిన
పని తప్పక నెమిలిపడగ బల్లున విఱిగెన్. 32

చం. విఱిగినఁ బొంగె నద్దనుజవీరవరుండు మనంబులోపలన్
వెఱపును ఖేదము న్వెఱఁగు విస్మయముం బొడమంగ మంత్రి 'యి
ట్లెఱిఁగి యెఱింగి మాఱిఁ దనయింటికి రమ్మను వాని కేమియుం
గఱపిన నొప్పునే విధివికారము దప్పునె యిట్లు ద్రిప్పునే. 33

వ. అనియె నట్టియెడ. 34

కం. బాణుండు సెలఁగ దనుజ
ప్రాణంబులు దల్లడిల్లఁ బ్రతిభయతర మై
శోణితపురమున నెల్లను
శోణితవర్షంబు గురిసె సురపతి యలరన్. 35

# విషయ సూచిక

## వ్యాకరణము

**1. అంటే ఏమిటి? (పారిభాషిక పదాలు)**

అచ్చులు, హల్లులు, సంధి; ఆదేశం, ఆగమం, బహుళం, ఉపధ, శబ్దపల్లవం, ఆమ్రేడితం, ధాతువు, ఆచ్ఛికం, కర్మధారయం, ద్విత్వం, సంయుక్తాక్షరం.

**2. తెలుగు సంధులు**

అకార, ఇకార, ఉకార, యడాగమ, గసడదవాదేశ, సరళాదేశ, ఆమ్రేడిత, ద్విరుక్తటకారాదేశ, త్రిక, పుంప్వాదేశ, రుగాగమ, లు–ల–న, ప్రాతాది, నుగాగమ సంధులు.

**3. సంస్కృత సంధులు**

సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి, శ్చుత్వ, యణాదేశ, అనునాసిక, జశ్త్వ, ఛత్వ, విసర్గ, తుగాగమ సంధులు.

**4. ఛందస్సు**

గురు లఘు లక్షణాలు – గురు లఘువుల గుర్తించడంలో జాగ్రత్త – గణాలను ఎలా గుర్తుంచుకోవాలి? యతి ప్రాసలంటే ఏమిటి?–యతిమైత్రి వున్నఅక్షరాలు. ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం, మత్తకోకిల, తరళం, పంచచామరం, కందం, తేటగీతి, ఆటవెలది, సీసం, ద్విపద, ముత్యాల సరం.

**5. అలంకారాలు**

వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాస, లాటానుప్రాస, అంత్యానుప్రాస, యమక, ముక్తపదగ్రస్త, ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక, అతిశయోక్తి, శ్లేష, అనన్వయ, ఉల్లేఖ, దృష్టాంత, విరోధాభాస, అర్థాంతరన్యాస, దీపక, పరికర, సమాసోక్తి, సార, భ్రాంతిమంత, ప్రతీప, సందేహాలంకారాలు.

**6. సొంతవాక్యాలు**

పరీక్షలలో రాదగిన ఏర్చి కూర్చిన 116 సొంత వాక్యాలు.

# అంటే ఏమిటి?

## 1. పారిభాషిక పదాలు

**1. అచ్చులు:** అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః అనేవి అచ్చులు.

**2. హల్లులు :** క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ ళ అనేవి హల్లులు.

**3. సంధి :** పూర్వ పరస్వరములకు పరస్వర మేకాదేశమగుట సంధి.
ఉదా॥ రాముడు + ఇతడు = రాముడితడు.
ఇక్కడ 'రాముడు' అనే పదం చివర అక్షరంలో 'ఉ' అనే స్వరం వుంది.. ఇది పూర్వస్వరం. పరంగా వున్న 'ఇ' పరస్వరం. రెంటికీ కలిపి పరస్వరమైన 'ఇ' రావటం సంధి.

**4. ఆదేశము :** శత్రువదాదేశః. ఉన్న అక్షరాన్ని త్రోసివేసి శత్రువులా మరొక అక్షరం రావడాన్ని ఆదేశమంటారు.
ఉదా॥ కాయ + కూరలు = కాయగూరలు
ఇక్కడ 'క' స్థానంలో 'గ' ఆదేశంగా వచ్చింది.

**5. ఆగమము:** మిత్రవదాగమః. 'ఆగమమనగా వర్ణాధిక్యము'. ఉన్న అక్షరానికి తోడు మరొక అక్షరం మిత్రునిలాగా చేరడాన్ని ఆగమం అంటారు.
ఉదా॥ జవ + ఆలు = జవరాలు (రుగాగమం)

**6. బహుళము:** సూత్రంలో చెప్పబడిన వ్యాకరణకార్యం నిత్య (సంధి జరుగుట), నిషేధ (జరుగకుండుట), వికల్ప (సంధి జరిగిన, జరుగని రూపాలు రెండూ రావటం), అన్యవిధ ప్రవృత్తి అని నాల్గు విధాలుగా ప్రవర్తించటాన్ని బహుళం అంటారు.
ఉదా॥ నిత్య – రామ + అయ్య = రామయ్య
నిషేధ – అమ్మ + ఏది = అమ్మయేది
వికల్ప – మేన + అల్లుడు = మేనల్లుడు; మేనయల్లుడు
అన్యవిధము – ఒక + ఒక = ఒకానొక

**7. ఉపధ:** తుది వర్ణమునకు ముందు వర్ణము.
ఉదా॥ రామ – ఇక్కడ (రామ్ + అ) 'మ్' ఉపధ.

**8. ధాతువు:** క్రియ యొక్క మూలరూపాన్ని ధాతువు అంటారు. 'తినడం' అనే క్రియకు తిను అనేది మూలరూపం. ఇలాగే తక్కినవి కూడా.
ఉదా॥ తిను; విను.

**9. శబ్దపల్లవం:** రెండు ధాతువుల లేదా ఒక నామవాచకము, ఒక ధాతువు కలయికవల్ల ఏర్పడే విలక్షణ పదము.
ఉదా॥ మేలు + కొను = మేలుకొను.

**10. ఆమ్రేడితం:** ద్విరుక్తము యొక్క పర రూపము ఆమ్రేడితము. (ఒక పదాన్ని రెండుసార్లు ఉచ్చరించినపుడు, రెండవసారి ఉచ్చరింపబడేది ఆమ్రేడితం.)
ఉదా॥ ఏమి + ఏమి = ఏమేమి (రెండవ 'ఏమి' ఆమ్రేడితము).

**11. ఆచ్ఛికము:** (సంస్కృత సమేతరమైన యీ భాష యచ్చయనంబడు) అచ్చ తెనుగును ఆచ్ఛికమంటారు.
ఉదా॥ తల, కల, నెల మొదలగునవి.

**12. కర్మధారయము :** విశేషణానికి విశేష్యంతో సమాసాన్ని కర్మధారయ మంటారు.
ఉదా॥ వృద్ధ కపోతము.
ఇందులో 'వృద్ధ' విశేషణం, 'కపోతం' విశేష్యం. రెండూ కలిసి వృద్ధకపోతం.

**13. ద్విత్వము:** ఏ హల్లుకు ఆ హల్లు అక్షరమే ఒత్తుగా వస్తే, ఆ ఒత్తు కలిగిన అక్షరాన్ని ద్విత్వాక్షరం అంటారు. అలా ఒత్తు రావడాన్ని ద్విత్వం అంటారు.
ఉదా॥ అక్క, చెల్లి (ఇందులో క, ల ద్విత్వాక్షరాలు)

**14. సంయుక్తాక్షరము :** రెండు వేర్వేరు హల్లులు కలిసినపుడు, ఆ కలిసిన అక్షరాన్ని సంయుక్తాక్షరమంటారు.
ఉదా॥ కర్ణ. ఇందులో ర కార, ణ కారాలు వేర్వేరు హల్లులు. ఇవి రెండూ కలిసి 'ర్ణ' అయింది. ఇది సంయుక్తాక్షరం.

# 2. తెలుగు సంధులు

**1. అకారసంధి:**

సూ: అత్తునకు సంధి బహుళముగా నగు

అత్తు అంటే హ్రస్వమైన అకారము. దీనికి అచ్చు పరమైనపుడు సంధి బహుళంగా అవుతుంది. సంధిలో నిత్య, నిషేధ, వైకల్పిక, అన్యకార్య ప్రవృత్తులుండటాన్ని 'బహుళం' అంటారు.

ఉదా॥ రామ + అయ్య = రామయ్య (నిత్య)

అమ్మ + ఇచ్చెను = అమ్మ యిచ్చెను (నిషేధ)

మేన + అల్లుడు = మేనల్లుడు; మేనయల్లుడు (వైకల్పిక)

ఒక + ఒక = ఒకానొక (అన్యకార్యప్రవృత్తి)

**1. ఇకారసంధి:**

సూ: ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు

ఇత్తు అంటే హ్రస్వ 'ఇ' కారము. ఏమ్యాదులు అంటే ఏమి, మఱి అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి – మొదలైనవి. హ్రస్వ ఇకారమునకు అచ్చు పరమైనపుడు సంధి వచ్చిన రూపం ఒకటి. రాని రూపం ఒకటి వుంటుంది. దీన్ని వైకల్పికం అంటారు.

ఉదా॥ ఏమి + అంటివి = ఏమంటివి (సంధి); ఏమియంటివి (సంధిలేదు)

మఱి + ఏమి = మఱేమి (సంధి); మఱియేమి (సంధి లేదు)

**3. ఉకారసంధి:**

సూ: ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు

ఉత్తు అంటే హ్రస్వ ఉకారము. పూర్వపదం చివర వున్న హ్రస్వమైన ఉ కారానికి అచ్చు పరమైతే సంధి జరుగుతుంది.

ఉదా॥ రాముడు + అతడు = రాముడతడు

సోముడు + ఇతడు = సోముడితడు

మనము + ఉంటిమి = మనముంటిమి

అతడు + ఎక్కడ = అతడెక్కడ

ఇతడు + ఒకడు = ఇతడొకడు

**4. యడాగమసంధి:**

సూ: సంధి లేనిచోట స్వరంబుకంటె పరంబయిన స్వరంబునకు యడాగమం బగు.

ఒక అచ్చుకు పరంగా వేరొక అచ్చు ఉన్నపుడు, రెంటికి సంధి జరగనపుడు రెండవ అచ్చుకు ముందు 'య్' ఆగమంగా వస్తుంది.

ఉదా॥ మా + అమ్మ = మా యమ్మ (మా + య్ + అమ్మ)

మీ + ఇల్లు = మీయిల్లు (మీ + య్ + ఇల్లు)

మా + ఊరు = మా యూరు (మా + య్ + ఊరు)

**5. గసడదవాదేశసంధి:**

సూ: 1) ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు. ప్రథమావిభక్తితో అంతమయ్యే పదాలకు పరంగా వున్న పరుషాక్షరములు సరళములవుతాయి.

ఉదా॥ వాడు + కొట్టె = వాడు గొట్టె

అపుడు + చనియె = అపుడు సనియె; అపుడు చనియె

నీవు + టక్కరివి = నీవు డక్కరివి; నీవు టక్కరివి

మీరు + తలడు = మీరు దలడు; మీరు తలడు

సూ. 2) ద్వంద్వంబునం బదంబు పయి పరుషములకు గసడదవలగు.

ఉదా॥ కూర + కాయలు = కూరగాయలు

కాలు + చేయి = కాలు సేతులు

టక్కు + టెక్కు = టక్కుడెక్కులు

తల్లి + తండ్రి = తల్లిదండ్రులు

ఊరు + పల్లె = ఊరువల్లెలు

**6. సరళాదేశ (ద్రుత) సంధి:**

సూ: ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

న కారము ద్రుతము. ద్రుతము చివరగా కలది ద్రుతప్రకృతికము. ద్రుత ప్రకృతికాలైన శబ్దాలకు పరంగా వుండే క-చ-ట-త-ప అనే అక్షరాలు సంధిలో క్రమంగా గ-జ-డ-ద-బ లుగా మారతాయి.

ఉదా॥ పూచెను + కలువలు = పూచెను గలువలు

తోచెను + చుక్కలు = తోచెను జుక్కలు

చేసెను + టక్కులు = చేసెను డక్కులు

నెగడెను + తమములు = నెగడెను దమములు

మొగిడెను + పద్మము = మొగిడెను బద్మము

పై ఉదాహరణలలో క-చ-ట-త-ప లు గ-జ-డ-ద-బ లుగా మారటం గమనించవచ్చు.

**7. ఆమ్రేడిత సంధి:**

సూ: అచ్చునకు ఆమ్రేడితము పరంబగునపుడు సంధి తఱచుగనగు.

ఒకే పదం రెండుసార్లు వరుసగా పలికితే రెండోపదాన్ని ఆమ్రేడితం అంటారు. అచ్చునకు ఆమ్రేడితం పరంబైనపుడు సంధి జరిగి మొదటి పదం చివరి అచ్చు పోయి రెండవ పదం మొదటి అచ్చుతో సంధి జరుగుతుంది.

ఉదా॥ ఆహా + ఆహా = ఆహాహా

ఏమీ + ఏమీ = ఏమేమీ

ఔర + ఔర = ఔరౌర

**8. ద్విరుక్తటకారాదేశ సంధి:**

సూ: 1) కుఱు చిఱు కడు నడు నిడు శబ్దంబుల ఱడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు.

కుఱు చిఱు కడు నడు నిడు మొదలైన శబ్దాలలోని ఱ, డ లకు పరంగా అచ్చు ఉంటే ఆ ఱ-డ లు 'ట్ట'గా మారతాయి. అంటే ద్విత్వ టకారం వస్తుంది.

ఉదా॥ కుఱు + ఉసురు = కుట్టుసురు

చిఱు + ఎలుక = చిట్టెలుక

కడు + ఎదురు = కట్టెదురు

నడు + ఇల్లు = నట్టిల్లు

నిడు + ఊరుపు = నిట్టూరుపు

సూ. 2) ఆమ్రేడితము పరమగునపుడు కడాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల అదంతంబగు ద్విరుక్తటకారాదేశమగు.

కడ, చివర మొదలైన పదాలు రెండు సార్లు వరుసగా వస్తే మొదటి పదంలోని మొదటి అచ్చు తర్వాత వున్న వర్ణాలన్నీ పోయి దాని స్థానంలో 'ట్ట' అనే వర్ణం వస్తుంది.

ఉదా॥ కడ + కడ = కట్టకడ

చివర + చివర = చిట్టచివర

తుద + తుద = తుట్టతుద

కొన + కొన = కొట్టకొన

పగలు + పగలు = పట్టపగలు

**9. త్రికసంధి:**

సూ: ఆ–ఈ–ఏలు త్రికములు. త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళముగా నగును. ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.

ఆ–ఈ–ఏ అనే అక్షరాలను త్రికములంటారు. సమాసాలలో ఆ–ఈ–ఏలకు అసంయుక్త హల్లు పరమైతే ఆ హల్లుకు ద్విత్వం బహుళంగా వస్తుంది. ఆ విధమైన ద్విత్వంతో కూడిన హల్లు పరమైతే మొదటి దీర్ఘాక్షరం హ్రస్వాక్షరమవుతుంది.

ఉదా॥ ఆ + చోటు = అచ్చోటు

ఇక్కడ 'చో' అనేది అసంయుక్త హల్లు. దానికి ద్విత్వం వస్తే 'చ్చో' అవుతుంది. దానికి ముందున్న దీర్ఘం హ్రస్వంగా మారుతుంది. అంటే 'ఆ' అనే దీర్ఘాక్షరం 'అ' అయింది.

ఆ + చోటు – ఆ + చ్చోటు = అచ్చోటు

**10. పుంప్వాదేశము:**

సూ: కర్మధారయంబులందు ము వర్ణకంబునకుం పు, ంపులగు.

కర్మధారయమంటే విశేషణానికి విశేష్యంతో సమాసం కలగటం. అలాంటి సమాసంలో మొదటి పదం చివర 'ము' వర్ణం వుంటే 'ము' వర్ణానికి బదులు 'పు'గానీ, 'ంపు'గానీ వస్తాయి.

ఉదా॥ సరసము + వచనము = సరసపు వచనము; సరసంపు వచనము

దీపము + సమ్మె = దీపపు సమ్మె

ముత్యము + చిప్ప = ముత్యపు చిప్ప

**11. రుగాగమ సంధి:**

సూ: పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరంబగునపుడు కర్మధారయంబునందు రుగాగమంబగు.

పేద, బీద, ముద్ద, బాలెంత, కొమ, జవ, అయిదవ మొదలైనవి పేదాది శబ్దాలు. కర్మధారయ సమాసంలో ఈ శబ్దాలకు 'ఆలు' అనే శబ్దం పరంగా వుంటే రెంటి మధ్య రుగాగమం వస్తుంది.

ఉదా॥ పేద + ఆలు = పేదరాలు (పేద + ర్ + ఆలు)

ముద్ద + ఆలు = ముద్దరాలు (ముద్ద + ర్ + ఆలు)

కొమ + ఆలు = కొమరాలు (కొమ + ర్ + ఆలు)

**12. లు-ల-నలసంధి:**

సూ: లు-ల-న లు పరంబగునపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును తత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగు.

'లు-ల-న' అనే అక్షరాలు పరంగా వుంటే ఆగమంగా వచ్చిన 'ము' కారమునకు కొన్నిచోట్ల లోపము వికల్పంగా అవుతుంది. అలాగ 'ము' లోపించినపుడు దానిముందున్న హ్రస్వం దీర్ఘంగా మారుతుంది.

ఉదా॥ వజ్రము + లు = వజ్రాలు

వజ్రము + లను = వజ్రాలను

వజ్రము + న = వజ్రాన

**13. ప్రాతాది సంధి:**

సూ: ప్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబులకెల్ల లోపము బహుళంబుగా నగు.

ప్రాత-లేత-పూవు మొదలైనవి ప్రాతాదులు. వీటితో మరో శబ్దానికి సమాసం జరిగేటపుడు మొదటి అచ్చు మాత్రం మిగిలి తక్కిన అక్షరాలు లోపిస్తాయి.

ఉదా॥ ప్రాత + ఇల్లు = ప్రాయిల్లు; ప్రాత యిల్లు

లేత + దూడ = లేదూడ; లేత దూడ

పూవు + రెమ్మ = పూరెమ్మ; పూవు రెమ్మ

ఇక్కడ ప్రాత + ఇల్లు అన్నప్పుడు 'ప్రా' అనేది తొలి అచ్చు. అది మాత్రం మిగిలి వుండి 'త' లోపించింది.

**14. నుగాగమ సంధి:**

సూ: షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు.

షష్ఠీ విభక్తి కలిగిన పదానికి చివరి అక్షరం ఉకారం గానీ, ఋకారంగానీ వుండి దానికి పరంగా అచ్చు వుంటే ఉకార ఋకారాల మధ్య నుగాగమం వస్తుంది.

ఉదా॥ రాజు యొక్క + ఆజ్ఞ = రాజునాజ్ఞ

విధాతృ యొక్క + ఆనతి = విధాతృనానతి

'యొక్క' అనే విభక్తి షష్ఠీ సమాసాన్ని సూచిస్తోంది. 'రాజు' అన్నపుడు ఉకారాంతంగానూ, 'విధాతృ' అన్నపుడు ఋకారాంతంగానూ శబ్దాలు వుండటం గమనించవచ్చు.

# 3. సంస్కృత సంధులు

**1. సవర్ణదీర్ఘ సంధి:**

సూ: అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణములు పరమైనచో దీర్ఘ మేకాదేశమగును.

సవర్ణాలు అంటే సమానమైన వర్ణాలు అని అర్థం. 'అ' వర్ణానికి 'అ', 'ఆ' లు సవర్ణాలు. అలాగే తక్కినవి. ఇలాగ సవర్ణాలు పరమైనపుడు దీర్ఘం ఏకాదేశంగా వస్తుంది.

ఉదా॥ దేవ + ఆలయము = రామయ్య

కపి + ఇంద్రుడు = కపీంద్రుడు

మధు + ఉదయము = మధూదయము

పితృ + ఋణము = పితౄణము

**2. గుణ సంధి:**

సూ: అకారమునకు ఇఉఋ లు పరమైనపుడు క్రమముగా ఏ,ఓ,అర్‌లు ఆదేశమగును.

అ + { ఇ – ఏ, ఉ – ఓ, ఋ – అర్ }

అకారానికి 'ఇ' పరమైతే 'ఏ' కారము, 'ఉ' పరమైతే 'ఓ' కారము, 'ఋ' పరమైతే 'అర్' వస్తాయి.

ఉదా॥ రాజ + ఇంద్రుడు = రాజేంద్రుడు

మహా + ఉత్సవము = మహోత్సవము

రాజ + ఋషి = రాజర్షి

**3. వృద్ధి సంధి:**

సూ: అకారమునకు ఏ, ఐ లు పరమైనపుడు 'ఐ' కారము, ఒ, ఓ లు పరమైనపుడు 'ఔ' కారము ఆదేశమగును.

ఉదా॥ ఏక + ఏక = ఏకైక (అ + ఏ = ఐ)

అష్ట + ఐశ్వర్యములు = అష్టైశ్వర్యములు (అ + ఐ = ఐ)

మహా + ఓషధి = మహౌషధి (అ + ఓ = ఔ)

మహా + ఔన్నత్యము = మహౌన్నత్యము (అ + ఔ = ఔ)

**4. యణాదేశ సంధి:**

సూ: ఇ–ఉ–ఋ లకు అసవర్ణాచ్చులు పరమైనపుడు క్రమంగా య–వ–ర–ల వచ్చును.

య, వ, ర, లను యణ్ణులు అంటారు.

అసవర్ణాచ్చులు అంటే సమానం కాని అచ్చులు. అవి పరంగా వుంటే ఈ విధంగా సంధి జరుగుతుంది.

ఇ + అ = య

ఉ + అ = వ

ఋ + అ = ర

ఉదా॥ ప్రతి + అక్ష = ప్రత్యక్ష

అణు + అస్త్రము = అణ్వస్త్రము

పితృ + అర్థము = పిత్రర్థము

**5. శ్చుత్వ సంధి:**

సూ: సకార తవర్గములకు శకార చ వర్గములు పరమైనచో శకార చ వర్గము లాదేశమగును.

త వర్గమ్ము అంటే త–థ–ద–ధ–న అనే అక్షరాలు – చ వర్గము అంటే చ–ఛ–జ–ఝ–ఞ అనే అక్షరాలు.

'స'కారానికిగానీ 'త' వర్గాక్షరాలకుగానీ 'శ'కారం లేదా 'చ' వర్గాక్షరాలు పరమైతే సకారానికి 'శ'కారం, 'త' వర్గాక్షరానికి 'చ' వర్గాక్షరం ఆదేశంగా వస్తాయి.

ఉదా॥ మనస్ + శాంతి = మనశ్శాంతి (స్ + శా = శ్శా)

సత్ + జనుడు = సజ్జనుడు (త్ + జ = జ్జ)

సత్ + చరిత్ర = సచ్చరిత్ర (త్ + చ = చ్చ)

**6. అనునాసిక సంధి:**

సూ: నకార మకారములు పరమైనపుడు కచటతపలకు క్రమముగా ఆ వర్గానునాసికములే ఆదేశముగా వచ్చును.

క ఖ గ ఘ ఙ – ఇది క వర్గము. ఈ వర్గంలోని అనునాసికాక్షరం 'ఙ' (అనునాసికం అంటే ముక్కుతో పలికే అక్షరం). ఇలాగే క, చ, ట, త, ప లకు ఆయా వర్గాల అనునాసికాక్షరాలు వస్తాయి.

ఉదా॥ వాక్ + మయము = వాఙ్మయము

విరాట్ + మహిమ = విరాణ్మహిమ

జగత్ + నిలయ = జగన్నిలయ

**7. జశ్త్వ సంధి:**

సూ: కచటతపలకు వర్గ తృతీయ, చతుర్థాక్షరములు, హయవరలు, అచ్చులు పరమైనపుడు వరుసగా గజడదబలు వచ్చును.

కచటతపలలో ఒక్కొక్క వర్గంలో ఐదేసి అక్షరాలుంటాయి. ఉదాహరణకు 'క' వర్గంలో క–ఖ–గ–ఘ–ఙ అనే అక్షరాలుంటాయి. అలాగే తక్కిన వర్గాలలో కూడా ఆయా వర్గాక్షరాలుంటాయి. వీటిలో మూడవ, నాల్గవ అక్షరాలుగానీ, హ–య–వ–ర కానీ, అచ్చులుగానీ కచటతపలకు పరమైతే సంధి జరిగి, గజడదబలు వస్తాయి.

ఉదా॥ వాక్ + ఈశ్వరి = వాగీశ్వరి

(ఇక్కడ క కారానికి 'ఈ' అనే అచ్చు పరమైంది. కనుక సంధి జరిగి 'గీ' అయింది. ఇలాగే తక్కినవి గ్రహించాలి.)

అచ్ + అంతము = అజంతము

షట్ + భుజి = షడ్భుజి

సత్ + ఆశయము = సదాశయము

సుప్ + అంతము = సుబంతము

**8. ఛత్వ సంధి:**

సూ: అనునాసికములు తప్ప తక్కిన వర్గాక్షరములు పరమైన శ వర్ణము ఛ వర్ణమగును.

క చ ట త ప వర్గాక్షరాలలో అనునాసికాక్షరాలు (అంటే ఙ, ఞ, ణ, న, మ) కాకుండా మిగిలిన వర్ణాలకు శకారం పరంగా వస్తే సంధిలో ఛ కారం వస్తుంది.

ఉదా॥ సత్ + శీలి = సచ్ఛీలి

విద్యుత్ + శక్తి = విద్యుచ్ఛక్తి

**9. విసర్గ సంధి:**

సూ: విసర్గకు అకారము పరమగునప్పుడు ఓ కారము వచ్చును.

ఉదా॥ తపః + బలము = తపోబలము

శిరః + మణి = శిరోమణి

వయః + భారము = వయోభారము

(1) విసర్గమునకు శ ష స లు పరమగునపుడు క్రమముగా శ ష స లు వచ్చును.

తేజః + శాలి = తేజశ్శాలి

తపః + శక్తి = తపశ్శక్తి

(2) విసర్గమునకు క ఖ ప ఫ లు పరమగునపుడు విసర్గ మారదు.

ప్రాతః + కాలము = ప్రాతఃకాలము

మనః + ఖేదము = మనఃఖేదము

అంతః + పురము = అంతఃపురము

తపః + ఫలము = తపఃఫలము

(3) కొన్ని చోట్ల విసర్గకు రేఫాగమము వచ్చును.

జనుః + మృతి = జనుర్మృతి

**10. తుగాగమ సంధి:**

సూ: పదాంతమందలి అచ్చునకు ఛ కారము పరమగునపుడు తుగామ మగును.

ఉదా॥ విషాద + ఛాయ = విషాదచ్ఛాయ

మేఘ + ఛాయ = మేఘచ్ఛాయ

# 4. ఛందస్సు

పద్య లక్షణాలను చెప్పేది ఛందస్సు. ఛందస్సు గురించి తెలిసికొనే ముందు గురు లఘువులు అంటే ఏమిటో తెలిసికోవాలి.

అక్షరాలు గురువులనీ, లఘువులనీ రెండు రకాలు. పలకడానికి ఒక మాత్ర కాలం పట్టేది లఘువు. రెండు మాత్రల కాలం పట్టేది గురువు. మాత్ర అంటే ఒక రెప్పపాటు కాలం. ఉదాహరణకు 'క' అనేది ఒక మాత్ర; 'కా' అనేది రెండు మాత్రలు.

**గురువు లక్షణాలు:**

1) దీర్ఘాక్షరాలన్నీ గురువులు

ఉదా॥ ఆ, కా, కీ, గూ, కే మొదలైనవి

2) ఐ ఔలు వాటితో కూడిన హల్లులు గురువులు

ఉదా॥ ఐ, కై, చై, ఔ, కౌ, చౌ మొదలైనవి

3) విసర్గతో కూడిన అక్షరాలు గురువులు

ఉదా॥ కః, చః, టః, మొదలైనవి

4) నిండు సున్నతో కూడిన అక్షరాలు గురువులు

ఉదా॥ అం, జం, కం, చం మొదలైనవి

5) ద్విత్వాక్షరాలకు ముందున్న అక్షరాలు గురువులు

ఉదాహరణకు 'అక్క' అనే పదంలో 'క' అనేది ద్విత్వాక్షరం. దీనికి ముందున్న 'అ' అనేది గురువు. ఇలాగే చెల్లి, తల్లి, అమ్మ, అన్న, మొదలైనవి.

6) సంయుక్తాక్షరాలకు ముందున్న అక్షరాలు గురువులు.

ఉదా॥ వర్ణము, లక్ష్మి, విష్ణువు మొదలైనవి

7) పొల్లు హల్లులతో కూడిన అక్షరాలు గురువులు

ఉదా॥ కన్, కల్, కమ్ మొదలైనవి

**లఘువు లక్షణాలు:**

హ్రస్వాక్షరాలన్నీ లఘువులు.

ఉదా॥ అ, ఇ, ఉ, క, గి, మొదలైనవి.

గురువును 'U' అనే సంజ్ఞతోనూ, లఘువును 'I' అనే సంజ్ఞతోనూ గుర్తిస్తారు.

గణము అంటే అక్షరాల సమూహం. గణాలలో రెండక్షరాలవీ, మూడక్షరాలవీ, నాల్గక్షరాలవీ కూడా ఉన్నాయి.

**రెండక్షర గణాలు**

గగము – U U – ఉదా॥ ఏమీ, రామా మొదలైనవి

గలము – U I – ఉదా॥ ఆమె, సీత మొదలైనవి

లగము – IU – ఉదా॥ కదా, భలే మొదలైనవి

('గలము' నే 'వగణము' అని కూడా అంటారు.)

**మూడక్షర గణాలు**

| | | |
|---|---|---|
| యగణం | – IUU – | మహాత్మా! |
| మగణం | – UUU– | శ్రీరామా! |
| తగణం | – UUI – | పాంచాలి |
| రగణం | – UIU – | జీవితం |
| జగణం | – IUI – | పొలాలు |
| భగణం | – UII – | రాముడు |
| నగణం | – III – | లలిత |
| సగణం | – IIU – | జననీ! |

**నాల్గక్షర గణాలు**

నలము – IIII – జనకుడు

నగము – IIIU – కలకలం

సలము – IIUI – అతిలోక

**గురు లఘువులను గుర్తించడంలో జాగ్రత్త**

గురులఘువులను గుర్తించడంలో జాగ్రత్తగా వుండాలి. ఖ, ఘ, ఛ, ఝ వంటి ఒత్తు అక్షరాలను చూసి గురువులుగా పొరబడరాదు. వట్రువసుడి కలిగిన అక్షరాలను చూసి గురువనుకోరాదు. తన హృదయము అనే మాటలోని 'న' గురువు కాదు. 'హృ' అనేది సంయుక్తాక్షరం కాదు. కృషి, గృహము, హృదయము వంటి మాటల్లోని మొదటి అక్షరాలు ఋకారంతో కూడినవి. ఋకారము అచ్చు. కనుక క్ + ఋ కృ అవుతుంది. ఇక్కడ హల్లు అచ్చుతో కలుస్తూంది. కనుక ఇది మామూలు అక్షరం. రెండు హల్లులు కలిస్తేనే సంయుక్తాక్షరమవుతుంది. ఒక హల్లు, ఒక అచ్చు కలిస్తే అది సంయుక్తాక్షరం కాదు. గురు లఘువులను గుర్తించేటపుడు ఈ జాగ్రత్త అవసరం.

**గణాలను ఎలా గుర్తుంచుకోవాలి?**

గణాలను గుర్తుంచుకోడానికి ఒక సూత్రముంది. 'యమాతారాజ భానసలగం' అనే మాట గుర్తుంచుకోవాలి. దీనిని లఘు గురువులతో గుర్తించాలి. అపుడు ఇలా వుంటుంది.

I U U U I U I I I U

య మా తా రా జ భా న స ల గం

ఇందులోని ప్రతి అక్షరంతోనూ ఒక గణం ఏర్పడుతుంది. ఏ గణం కావాలనుకుంటే ఆ అక్షరంతో పాటు మూడు అక్షరాలు లెక్కించుకోవాలి. ఆ మూడక్షరాలకున్న గురు లఘువులను కలిపితే అది ఆ గణం అవుతుంది.

ఉదాహరణకు 'యగణం' కావాలనుకుంటే 'య మా తా' అనే అక్షరాలను గుర్తుంచుకోవాలి. అపుడు IUU వస్తుంది. అది యగణం. అలాగే మగణం కావాలనుకుంటే 'మా తా రా' అనే అక్షరాలను గుర్తించాలి. అపుడు UUU వస్తుంది. అది మగణం. ఇలాగే తక్కిన తగణం, రగణం మొదలైనవన్నీ వస్తాయి.

**యతి అంటే ఏమిటి?**

పద్యపాదంలోని మొదటి అక్షరాన్ని యతి అంటారు. పాదంలోని మొదటి అక్షరానికి అదే పాదంలో నిర్ణీత స్థానంలో ఉన్న మరో అక్షరానికి మైత్రి కుదిరితే దాన్ని యతిమైత్రి అని కానీ, యతి కుదిరింది అని కానీ అంటారు.

ఒక్కొక్కసారి పాదంలోని మొదటి అక్షరానికి నిర్ణీత స్థానంలోని మరో అక్షరానికి యతి కాకుండా పాదంలోని రెండవ అక్షరానికి, యతి స్థానం తర్వాత ఉన్న అక్షరానికి, (2 అక్షరాలూ కలిపి) యతి కుదిరిస్తే దాన్ని 'ప్రాసయతి' అంటారు.

సీసం, ఆటవెలది, తేటగీతి మొదలైన ఉపజాతుల్లో ఈ రకం యతి కనబడుతుంది.

ఉదా॥ 'చూడ' – 'జాడ' ఈ రెంటికి ప్రాసయతి కుదురుతుంది. ప్రాస అంటే ఏమిటి?

పద్యపాదంలోని రెండవ అక్షరాన్ని ప్రాసస్థానం అంటారు. మొదటి పాదంలో రెండవదిగా ఏ అక్షరం వస్తుందో తక్కిన పాదాల్లో కూడా రెండవదిగా అదే అక్షరం వస్తే ప్రాస నియమం వున్నట్లు లెక్క. ఈ నియమం కొన్ని పద్యాల్లో వుండదు.

**సూర్యగణాలూ, ఇంద్రగణాలూ**

గణాలలో సూర్యగణాలూ, ఇంద్రగణాలూ, చంద్రగణాలూ అని మూడు రకాలు.

ప్రస్తుతానికి మనం సూర్య, ఇంద్ర గణాల గురించి తెలుసుకోవడం అవసరం. సూర్యగణాలు రెండు. గలము, నగణము.

గలము – UI – నీవు

నగణము – III – అతడు

**ఇంద్రగణాలు**

ఇంద్రగణాలను గుర్తించుకోవడానికి ఒక సులభ మార్గముంది. 'నల నగ సల భరత' అనే మాటను గుర్తుంచుకుంటే చాలు. ఇవన్నీ ఇంద్రగణాలే.

నల – IIII – జనకుడు

నగ – IIIU – కలకలం

సల – IIUI – అతిలోక

భ – UII – రాముడు

ర – UIU – జీవితం

త – UUI – పాంచాలి

సూర్య, ఇంద్ర గణాలను ఆటవెలది, సీసం, తేటగీతి మొదలైన పద్యాలలో ప్రయోగిస్తారు.

**యతిమైత్రి ఉన్న అక్షరాలు**

1. అ ఆ ఐ ఔ య హ
2. ఇ ఈ ఋ ౠ ఏ ఏ
3. ఉ ఊ ఒ ఓ
4. క ఖ గ ఘ
5. చ ఛ జ ఝ శ ష స
6. ట ఠ డ ఢ
7. త థ ద ధ
8. న ణ జ్ఞ
9. ప ఫ బ భ మ
10. ల ళ డ
11. బిందు పూర్వక వర్గాక్షరానికి ఆ వర్గ అనునాసికాక్షరంతో యతి అంటే, బిందు పూర్వక ట ఠ డ ఢ లకు 'ణ'తో యతి. ఇలాగే తక్కినవి.

12. బిందుపూర్వక య ర ల వ శ ష స లకు – 'మ'తో యతి.

13. పు ఫు బు భు పొ ఫొ బొ భొ ము మూ మో

14. 'ఋ' (వట్రువసుడి) తో కూడిన హల్లులు (కృ చృ మొదలైనవి)

**పద్యాలు మూడు రకాలు**

పద్యాలను మూడు రకాలుగా వర్గీకరించారు.

**వృత్తాలు:** ఉత్పలమాల, చంపకమాల మొదలైనవి. ఇవి మూడక్షరాల గణాలు కల్గి, యతి, ప్రాస నియమబద్ధమై వుంటాయి.

**జాతులు:** కందము మొదలైనవి. ఇవి యతిప్రాసలు కలిగి మాత్రాగణ బద్ధమై వుంటాయి.

**ఉపజాతులు:** ఆటవెలది, సీసం మొదలైనవి. ఇవి యతి నియమబద్ధమై, సూర్య ఇంద్రగణాలను కలిగి వుంటాయి.

**1. ఉత్పలమాల**

గణాలు : భ–ర–న–భ–భ–ర–వ

పాదానికి 20 అక్షరాలుంటాయి.

యతి : పాదంలో మొదటి అక్షరానికి 10వ అక్షరానికి యతి మైత్రి.

ప్రాస : ప్రాస నియమం ఉంది.

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |

ఉదా॥ అంబన వాంబుజో జ్జ్వలక రాంబుజ శారద చంద్రచం ద్రికా

'అం' మొదటి అక్షరం. పదవ అక్షరం 'రాం' లోని 'ఆం' (కర + అంబుజ కరాంబుజ) రెంటికీ యతి చెల్లింది.

ప్రాస బిందుపూర్వక బ కారం 'ంబ'.

**2. చంపకమాల**

గణాలు : న–జ–భ–జ–జ–జ–ర

పాదానికి 21 అక్షరాలుంటాయి.

యతి : 11వ అక్షరం

ప్రాస : ప్రాస నియమం ఉంది.

న   జ   భ   జ   జ   జ   ర

III  IUI  UII  IUI  IUI  IUI  UIU

ఉదా॥ కనుగొ నికోప వేగము నకన్ను లనిప్పు లురాల యంగముల్

క – క లకు యతి.

ప్రాస – 'ను'

**3. శార్దూలము**

గణాలు : మ – స – జ – స – త – త – గ

పాదానికి 19 అక్షరాలుంటాయి.

యతి : 13వ అక్షరం

ప్రాస : ప్రాస నియమం ఉంది.

మ   స   జ   స   త   త   గ

UUU  IIU  IU  IIIU  UUI  UU  IU

ఉదా॥ కారేరా జులురా జ్యముల్క లుగవే గర్వోన్న తింబొంద రే

కా – గ లకు యతి.

ప్రాస – 'రే'

**4. మత్తేభము**

గణాలు : స – భ – ర – న – మ – య – వ

పాదానికి 20 అక్షరాలుంటాయి.

యతి : 14వ అక్షరం

ప్రాస : ప్రాస నియమం ఉంది.

స   భ   ర   న   మ   య   వ

IIU  UII  UIU  III  UUU  IUU  IU

ఉదా॥ సిరికిం జెప్పడు శంఖచ క్రయుగ మున్జేదో యిసంధిం పడే

సి – జే లకు యతి.

ప్రాస – 'రి'

**5. మత్తకోకిల**

గణాలు : ర – స – జ – జ – భ – ర

పాదానికి 18 అక్షరాలుంటాయి.

యతి : 11వ అక్షరం

ప్రాస : ప్రాస నియమం ఉంది.

ర స జ జ భ ర

U I U II U IU I I U I UI I UI U

ఉదా॥ మాధవా గమమె ల్లలోచ నమంజు శోణన వచ్చువిన్

మా - మం లకు యతి.

ప్రాస - 'ధ'

**6. తరళము**

గణాలు : న - భ - ర - స - జ - జ - గ

పాదానికి 19 అక్షరాలుంటాయి.

యతి : 12వ అక్షరం

ప్రాస : ప్రాస నియమం ఉంది.

న భ ర స జ జ గ

I I I UI I UI U I I U IUI IUI U

ఉదా॥ మతమె యట్లగు నేనియే మహిమం బ్రసిద్ధ తగల్గె దున్

మ - మం లకు యతి.

ప్రాస - 'త'

**ఒక కిటుకు**

ఈ వృత్తాలను గుర్తించడానికి ఒక కిటుకు వుంది.

1. ఉత్పలమాల పద్యపాదంలో మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే అది చంపకమాల అవుతుంది.

2. శార్దూల పద్యపాదంలో మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే అది మత్తేభం అవుతుంది.

3. మత్తకోకిల పద్యపాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే అది తరళం అవుతుంది.

**మరో కిటుకు**

శార్దూల వృత్తం పేరులో 'శ' అనేది మొదటి అక్షరం. దీనికి గణాలు మ-స-జ-స-త-త-గ అని 'మ' అనే అక్షరంతో ఆరంభమవుతాయి.

మత్తేభ వృత్తంలో కూడా ఇదే గారడీ జరిగింది. మత్తేభ వృత్తం. పేరులో 'మ' మొదటి అక్షరం కాగా గణాలు 'స-భ-ర-న-మ-య-వ' అని 'స' తో ఆరంభమవుతాయి. 'మ' - 'స' ల ఈ సంబంధాన్ని గుర్తుంచుకోవాలి.

**7. పంచ చామరము**

గణాలు : జ - ర - జ - ర - జ - గ

పాదానికి 16 అక్షరాలుంటాయి.

యతి : 10వ అక్షరం

ప్రాస : ప్రాస నియమం ఉంది.

| జ | ర | జ | ర | జ | గ |
|---|---|---|---|---|---|
| I U I | U I U | I U I | U I U | I U I | U |

ఉదా॥ అమీరు నంతవా నికైన యర్థిచెం తబోవు నా

అ - అ లకు యతి.

ప్రాస - 'మీ'

**8. కందం**

(అ) ఇందులో గగ-నల-భ-జ-స అనే గణాలుంటాయి.

(ఆ) 1,3 పాదాల్లో 3 గణాలుండాలి. 2,4 పాదాల్లో ఐదు గణాలుండాలి.

(ఇ) 1,2 పాదాలు కలిపి బేసిగణంగా జగణం వుండరాదు. 6వ గణంగా నలం కానీ, జగణం కానీ ఉండాలి.

(ఈ) 2,4 పాదాల చివరి గణం గురువుతో అంతం కావాలి. అంటే సగణం కానీ, గగం కానీ వుండాలి.

(ఉ) 2,4 పాదాల్లో మాత్రమే యతి నియమముంది. ఈ పాదాల్లో నాల్గవ గణాద్యక్షరం యతిస్థానంగా వుంటుంది.

(ఊ) ప్రాస నియమముంది.

(కంద లక్షణాన్ని సులభంగా గుర్తుంచుకోడానికి ఒక మార్గముంది. 1,2, పాదాల లక్షణమే 3,4 పాదాలకు వర్తిస్తుంది. అంటే రెండు భాగాలు చేయబడిన గోళాకారంలో ఒక సగం లాగే రెండవ సగం వున్నట్లు కందంలో కూడా మొదటి రెండు పాదాల్లాగే తక్కిన రెండు పాదాలుంటాయి.)

ఇన్ని లక్షణాలున్నాయి కనుకనే 'కందం రాసినవాడే కవి, పందిని పొడిచిన వాడే బంటు' అనే లోకోక్తి పుట్టింది. సుమతీ శతకంలోని పద్యాలన్నీ కందాలే.

గగ జ భ

UU I UI UII

ఉదా॥ అప్పి చ్చు వాడు వైద్యుడు

భ నల జ ర స

UI I IIII IUI UIU II U

నెప్పుడు నెడతెగ కపాఱు యేఱును ద్విజుడున్

2వ పాదంలో నాలుగవ గణాద్యక్షరంతో యతి

ఎ – యే లకు యతి.

ప్రాస – ద్విత్వ 'ప' కారం – 'ప్ప'

**9. తేటగీతి**

సూర్యుడొక్కరుండు సురరాజులిద్దఱు

దినకర ద్వయంబు తేటగీతి

పాదానికి 1 సూర్యగణం + 2 ఇంద్రగణాలు + 2 సూర్యగణాల చొప్పున 4 పాదాలుంటాయి.

ప్రతిపాదంలోనూ నాల్గవగణం మొదటి అక్షరంతో యతి. ప్రాసనియమంలేదు.

గల త భ న గల

UI UUI UII III UI

ఉదా॥ శాస్త్ర మాచార్యు సన్నిధి చదువ దేని

శా – చ లకు యతిమైత్రి.

ప్రాసయతి కూడా చెల్లుతుంది.

గల సల భ గల గల

UI IIUI UII UI UI

ఉదా॥ మల్లి కగులాబి చంపక వల్లి పూచె

మల్లి – వల్లి లకు ప్రాస యతి

**10. ఆటవెలది**

ఇనగణ త్రయంబు నింద్రద్వయంబును

హంసపంచకంబు నాటవెలది

పద్యంలో 1, 3 పాదాలలో పాదానికి 3 సూర్యగణాలు + 2 ఇంద్రగణాలు వుండాలి. 2,4 పాదలల్లో వరుసగా 5 సూర్యగణాలుండాలి. ప్రతిపాదంలోనూ నాల్గవ

గణం మొదటి అక్షరంతో యతి.

ప్రతిపాదంలోనూ నాల్గవగణం మొదటి అక్షరంతో యతి. ప్రాసనియమంలేదు.

గల గల గల ర సల

UI UI U I UI U I IUI

ఉదా॥ ఉప్పు కప్పు రంబునొక్కపోలికనుండు

గల గల న గల గల

UI UI I I I UI UI

చూడ చూడ రుచుల జాడ వేఱు

మొదటి పాదంలో ఉ–ఒ లకు యతి. రెండవ పాదంలో చూడ జాడ లకు ప్రాసయతి. ప్రాస నియమం లేదు.

వేమన శతకం ఆటవెలదిలో రచింపబడింది.

**11. సీసం**

కవికి కంసాలికి సీసము తేలిక అని లోకోక్తి

(అ) సీసపద్యంలో 4 పాదాలుంటాయి.

(ఆ) పద్యం చివర ఆటవెలదిగానీ, తేటగీతిగానీ వుండాలి.

(ఇ) ఒకొక్క పాదం రెండు చిన్న పాదాలుగా విభజింపబడి వుంటుంది. ఈ చిన్న పాదాలను దళాలు అందాం.

(ఈ) ప్రతిపాదంలోనూ మొదటి దళంలో 4 ఇంద్ర గణాలు, రెండో దళంలో 2 ఇంద్ర గణాలు 2 సూర్యగణాలు వుంటాయి.

(ఉ) ప్రతిదళంలోనూ 4వ గణం మొదటి అక్షరం యతిగా వుంటుంది.

(ఊ) ప్రాస నియమం లేదు.

త త ర భ

UUI U UI UIU U II

ఉదా॥ దీనార టంకాల తీర్థమా డించితి

ర ర గల గల

UIU UI U U I UI

దక్షిణా ధీశుము త్యాల శాల

దీ – తీ లకు, ద – త్యా లకు యతి చెల్లింది.

**12. ద్విపద**

ఇది రెండు పాదాలున్న పద్యం.

ప్రతి పాదంలోనూ 3 ఇంద్రగణాలు 1 సూర్యగణం వుంటాయి. పాదంలో 4వ గణం మొదటి అక్షరం యతి.

ప్రాస నియమం వుంది. (ప్రాస నియమం పాటించకపోతే మంజరి ద్విపద అవుతుంది.)

త సల త గల

U U I II UI U U I UI

ఉదా॥ నా తండ్రి కిని రంగ నాథుండు రక్ష

త సల త గల

UUI II UI UUI UI

నా తల్లి కిని రంగ నాథుండు రక్ష

నా – నా లకు యతి

ప్రాస – 'త'

**13. ముత్యాలసరం**

ఈ పేరుతో ఛందస్సును కీ॥శే॥ గురజాడ అప్పారావుగారు ప్రవేశపెట్టారు. దీనిని మాత్రా ఛందస్సు అంటారు. లఘువును ఒక మాత్ర అనీ, గురువును రెండు మాత్రలనీ గుర్తిస్తారు.

(అ) ఇందులో 4 పాదాలుంటాయి.

(ఆ) పాదానికి 14 మాత్రల చొప్పున మొదటి మూడు పాదాలుంటాయి. అవి వరుసగా 3 + 4 + 3 +4 మాత్రల చొప్పున ఉంటాయి.

(ఇ) 4వ పాదంలో మొత్తం 9 మాత్రలు కానీ, 12 మాత్రలు కానీ వుండాలి. అంటే 3 + 4 + 2 మాత్రల క్రమంలో వుండాలి. లేదా 3 + 4 + 3 + 2 మాత్రల క్రమంలో వుండాలి.

UI IIU UI UU

(అ) ఉదా॥ నాడు గుడిలో మండె గుండం 3 + 4 + 3 + 4 మాత్రలు

UI U II UI U II

మంట మింటిని ముట్టి యాడగ 3 + 4 + 3 + 4 మాత్రలు

| | | |
|---|---|---|
| | UI IIII UI IUI | |
| | కన్న నరపతి గుండె దిగులై | 3 + 4 + 3 + 4 మాత్రలు |
| | UI II U U | |
| | పట్టు విడ జొచ్చెన్ | 3 + 4 + 2 మాత్రలు |
| | U I I IU UI UII | |
| (ఆ) ఉదా॥ | పట్ట పగలే నట్ట వీధిని | 3 + 4 + 3 + 4 మాత్రలు |
| | UI UU UI U I I | |
| | పట్ట బోరే జార చోరులు | 3 + 4 + 3 + 4 మాత్రలు |
| | UI IIII U I UII | |
| | పట్ట దలచితి వింక నీవొక | 3 + 4 + 3 + 4 మాత్రలు |
| | UI UU UI II | |
| | పట్ట మేలే రాజు వట | 3 + 4 + 2 మాత్రలు |

# 5. అలంకారాలు

మనిషికి ఆభరణాలు ఎలా అందాన్నిస్తాయో అలాగే కావ్యానికి కూడా అలంకారాలు అందాన్ని కలిగిస్తాయి.

ఇవి రెండు రకాలు. అవి – 1) శబ్దాలంకారాలు, 2. అర్థాలంకారాలు.

**శబ్దాలంకారాలు**

శబ్దం వినడంతోనే వీటిని గుర్తించవచ్చు. ఇక్కడ అర్థం కంటె శబ్దానికి ప్రాధాన్యత ఉంటుంది.

**1. వృత్త్యాను ప్రాసాలంకారం**

ఒకే హల్లు మాటి మాటికీ ఆవృత్తి అవుతూ వుంటే అది వృత్త్యను ప్రాసం.

ఉదా॥ వెడవెడ చిడిముడి తడబడ నడుగిడు నడుగిడదు.

ఇక్కడ 'ద' అక్షరం మాటిమాటికీ వచ్చింది. ఇలాగే 'ఇష్టమృష్టాన్న కలన సంతుష్టు జేసి' అన్నపుడు 'ష్ట' అనే అక్షరం పదే పదే వచ్చింది.

**2. ఛేకాను ప్రాసాలంకారం**

ఎడం లేకుండా రెండు రెండు అక్షరాలు వెంటవెంటనే చమత్కారం కలిగిస్తూ రావటాన్ని ఛేకానుప్రాసం అంటారు.

ఉదా॥ కందర్ప దర్ప భంగ!

ఇక్కడ దర్ప, దర్ప అని వెంటవెంటనే మాటలు వచ్చాయి. కందర్పుడు అంటే మన్మథుడు. దర్పము అంటే గర్వము.)

**3. లాటాను ప్రాసాలంకారం**

ఒకే అర్థం గల పదాన్ని తాత్పర్య భేదంతో రెండుసార్లు ప్రయోగించటం లాటాను ప్రాసం.

ఉదా॥ కమలాక్షు నర్చించు కరములు కరములు.

ఇక్కడ 'కరములు' అన్న పదానికి అర్థం ఒకటే. కానీ తాత్పర్యం వేరు. రెండవసారి కరములు అంటే ధన్యమైన చేతులు అని తాత్పర్యం.

**4. అంత్యానుప్రాసాలంకారం**

ఒక పదం లేదా ఒకే అక్షరం మాటిమాటికీ ప్రయోగిస్తే అది అనుప్రాస. మాటల చివర అనుప్రాస పాటించడాన్ని అంత్యానుప్రాస అంటారు.

ఉదా॥

శ్రీ రఘురామ! చారు తులసీదళదామ! శమక్షమాది శృంగార గుణాభిరామ!

ఇక్కడ రామ, దామ, రామ అనేవి అంత్యాను ప్రాసలు.

### 5. యమకాలంకారం

అర్థభేదంతో ఒకే మాట మాటిమాటికీ ప్రయోగింపబడం యమకం.

ఉదా॥ లేమా! దనుజల గెలువగ
లేమా? నీవేల కడగి లేచితి విటు రా
లే, మాను మానవేనిన్
లే మా విల్లందు కొనుము లీలన్ కేలన్.

ఇక్కడ 'లేమా' అన్న మాట మాటిమాటికి ప్రయోగింపబడింది. అయితే, అర్థంలో మార్పు వుంది. మొదట 'లేమా' అన్నపుడు 'బాలా' అని అర్థం. రెండవసారి 'గెలువగ లేమా' అన్నపుడు 'లేమా' అన్న మాటికి 'మా చేత కాదా?' అని అర్థం.

### 6. ముక్తపదగ్రస్తాలంకారం

'ముక్త' అంటే వదలిపెట్టబడ్డ అనీ, 'గ్రస్త' అంటే, గ్రహించబడ్డ అనీ అర్థాలు. వెరసి ముక్తపదగ్రస్త మంటే వదలివేయబడిన పదాన్ని మళ్ళీ గ్రహించడం అని అర్థం.

ఉదా॥ నేను ఉదయాన్నే లేచి, లేచిన తరువాత స్నానం చేసి, చేసిన పిమ్మట దేవునికి నమస్కరిస్తాను.

ఇక్కడ 'లేచి' – 'లేచి', 'చేసి – 'చేసి' అని వదలి పెట్టబడిన పదాలే మళ్ళీ గ్రహించబడ్డాయి.

### అర్థాలంకారాలు

అర్థానికి ప్రాధాన్యత కలిగి రమణీయమైన భావాన్ని ప్రకటించేవి అర్థాలంకారులు.

### 7. ఉపమాలంకారం

ఉపమాన ఉపమేయాలకు చక్కని సామర్థ్యం చెప్పటం. 'ఉపమ' అంటే పోలిక. 'ఉపమానం' అంటే మనం దేనితో పోలుస్తున్నామో అది. దీనిని 'అప్రస్తుతం' అని అంటారు. ఉపమేయం అంటే మనం దేన్ని పోలుస్తున్నామో అది. దీనిని 'ప్రస్తుతం' అని అంటారు. 'వలె', 'అట్లు' మొదలైన పదాలను 'ఉపమావాచకములు' అంటారు. ఉపమాన ఉపమేయాలకు రెంటికీ సంబంధాన్ని తెలిపే అంశాన్ని 'సమానధర్మం'

అంటారు.

ఉదా॥ ఈ కాంతి వెన్నెలవలె చల్లగా వున్నది.

ఇక్కడ ఉపమానం 'వెన్నెల', ఉపమేయం 'కాంతి', ఉపమావాచకం 'వలె', సమానధర్మం 'చల్లదనం'.

### 8. ఉత్ప్రేక్షాలంకారం

ఊహించి చెప్పడం ఉత్ప్రేక్ష. ఉపమాన ధర్మ సంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా భావించటాన్ని ఉత్ప్రేక్షాలంకారమంటారు.

ఇందులో – అనినట్లు, ఏమో, కాబోలు మొదలైన పదాలు వస్తాయి. ఊహిస్తున్నాను, తలుస్తున్నాను, భావిస్తున్నాను మొదలైన మాటలు వాక్యాల్లో వుంటాయి. ఇది ఒక గుడ్డి గుర్తు మాత్రమే.

ఉపమానానికి, ఉపమేయానికి వున్న సమాన ధర్మాన్ని ఆధారం చేసుకొని ఉపమేయాన్నే ఉపమానంగా చెప్పడం ఇక్కడి విషయం.

ఉదా॥ ఆతడి పాట గంధర్వంగానమో అనునట్లున్నది.

### 9. రూపకాలంకారం

ఉపమాన ఉపమేయాలకు అభేదం చెపితే రూపకాలంకారం.

ఉదా॥ అతడి కీర్తిచంద్రిక లోకమంతా వ్యాపించింది.

ఇక్కడ కీర్తికీ, వెన్నెలకూ అభేదం చెప్పబడింది. అభేదం అంటే భేదం లేకపోవటం.

### 10. అతిశయోక్త్యలంకారం

ఉపమేయాన్ని మరుగుపరచి ఉపమానాన్ని గురించి చెపితే అతిశయోక్తి. అంటే కల్పనకు ప్రాధాన్యత వుంటుందిక్కడ.

ఉదా॥ ఈ వూరి మేడలు ఆకాశానికి ఎగసి సూర్యచంద్రుల రాక పోకలకు అడ్డుతగులుతున్నాయి.

ఇక్కడ ఉపమేయమైన 'మేడలు' అనే అంశాన్ని మరుగుపరచి, వాటి ఎదుగుదల వల్ల కలిగిన ఫలితం ప్రధానంగా చెప్పబడుతూంది.

### 11. శ్లేషాలంకారం

ఒకే వాక్యానికి నానార్థాలుండటం శ్లేష. అంటే నానార్థాలున్న శబ్దాలతో వాక్య రచన చేయటం.

ఉదా॥ రాజు కువలయానందకరుడు

ఇక్కడ రాజు, కువలయము అనే మాటలుక నానార్థాలున్నాయి.

రాజు అంటే – చంద్రుడు, ప్రభువు

కువలయము అంటే – కలువ, భూమి

ఈ వాక్యానికి 'చంద్రుడు కలువలకు ఆనందం కలిగించేవాడు' అనీ, 'ప్రభువు భూమికి ఆనందం కలిగించేవాడు' అనీ నానార్థాలు కలుగుతున్నాయి.

**12. అనన్వయాలంకారం**

ఒకే వస్తువు ఉపమాన ఉపమేయాలుగా వుంటే అది అనన్వయాలంకారం (దానికదే సాటి అని చెప్పడం)

ఉదా॥ కవిత్వంలో కాళిదాసుకు కాళిదాసే సాటి.

ఇక్కడ 'కాళిదాసు' అనే మాట ఉపమేయమైతే ఉపమానం కూడా అదే. అంటే అతడికి అతడే సాటి అని చెప్పడం.

**13. ఉల్లేఖాలంకారం**

(అ) ఒకే వస్తువును అనేకులు అనేక విధాలుగా చెప్పటం.

ఉదా॥ అతనిని స్త్రీలు మన్మథుడిగాను, యాచకులు కల్పవృక్షముగాను, శత్రువులు యమునిగాను భావిస్తారు.

ఇక్కడ ఒకే వ్యక్తిని అనేకులు అనేక విధాలుగా భావించారు.

(ఆ) ఒకే వస్తువును ఒక్కరే అనేక విధాలుగా భావించటం కూడా ఉల్లేఖమే అవుతుంది.

ఉదా॥ అతడు వాక్కులందు బృహస్పతి, కీర్తియందర్జునుడు, చాపమున భీష్ముడు.

ఇక్కడ ఒకే వ్యక్తిని ఒకరే అనేక విధాలుగా భావిస్తున్నారు. కనుక ఇది ఉల్లేఖము.

**14. దృష్టాంతాలంకారం**

వాక్యాలకు బింబ ప్రతిబింబత్వముంటే అది దృష్టాంతాలంకారము.

ఉదా॥ రాజా, నీవేకీర్తిమంతుడవు, చంద్రుడే కాంతిమంతుడు.

ఇందులో మొదటిది ఉపమేయ వాక్యం. రెండవది ఉపమాన వాక్యం. బింబ ప్రతిబింబత్వం ఇక్కడ వుంది. అంటే 'అది ఎలాగో ఇది అలాగే' అన్న రీతిలో చెప్పటం బింబ ప్రతిబింబ ధోరణి. ఇక్కడ కూడా 'చంద్రుడు ఎలాగ కాంతిమంతుడో నీవు

కూడా అలాగ కీర్తి మంతుడివి' అని చెప్పబడింది.

### 15. విరోధాభాసాలంకారం

విరోధమున్నట్లు కనిపిస్తూ నిజంగా విరోధం లేకుండటం విరోధాభాసాలంకారం. 'ఆభాస' అంటే లేకుండుట.

ఉదా॥ ఓ రాజా! నీ వక్షము హార రహితమయ్యు హారియే అవుతున్నది.

'హారి' అంటే హారము కలది అని అర్థం. కానీ ఇక్కడ రాజు వక్షం హారం లేకున్నా హారి అయింది. ఇది ఎలాగ? ముందు హారం లేదని చెప్పి మళ్ళీ ఉందనడం విరుద్ధం కదా? అయితే 'హారి' అనే మాటకు మనోహరమైనది అని మరో అర్థం కూడా వుంది. ఈ మాటవల్ల అంతకుముందు కన్పించిన విరోధం ఇపుడు లేదు. విరోధం ఉన్నట్లు అన్పించిందే కానీ విరోధం లేదు.

### 16. అర్థాంతరాన్యాసాలంకారం

సామాన్యముచే విశేషమునుగానీ విశేషముచే సామాన్యమును గానీ సమర్థిస్తే అది అర్థాంతరన్యాసము.

ఉదా॥ 1) ఆంజనేయుడు సముద్రమును దాటెను.
మహాత్ములకు సాధ్యం కానిదేది?

ఇక్కడ సముద్రాన్ని దాటడం అనేది విశేషం. ఆయన మహాత్ముడు కనుక ఆయనకది సామాన్యం. ఇక్కడ విశేషాన్ని సామాన్యంతో సమర్థించాము.

ఉదా॥ 2) పూలతో కూడిన దారం తలపై ధరించబడుతుంది
పండితునితో కూడిన అల్పుడుకూడా గౌరవింపబడుతున్నాడు కదా!

పూలతో కూడిన దారం తలపై ధరించబడటం సామాన్యం. అల్పుడు గౌరవించబడటం విశేషం. ఇక్కడ సామాన్యాన్ని విశేషంతో సమర్థించాము.

### 17. దీపకాలంకారం

వర్ణ్యమునకు అవర్ణ్యమునకు ధర్మైక్యము చెప్పినట్లయితే అది దీపకాలంకారం.

వర్ణ్యము అంటే వర్ణింపదలచినది. అవర్ణ్యమంటే వర్ణింపదలచనిది.

ఉదా॥ ఏనుగు మదముచేతను, రాజు ప్రతాపముచేతను ప్రకాశించును

ఇక్కడ వర్ణ్యం – రాజు. అవర్ణ్యం – ఏనుగు. ప్రకాశించడం ధర్మం. ఈ ధర్మం ఏనుగుకూ, రాజుకూ ఒకటే కనుక వర్ణ్యవస్తువైన రాజుకు, అవర్ణ్యవస్తువైన ఏనుగుకు ధర్మైక్యం చెప్పబడింది.

**18. పరికరాలంకారం**

విశేషణము సాభిప్రాయమైతే అది పరికరాలంకారము.

ఉదా॥ చంద్రశేఖరుడైన శివుడు మా తాపమును పోగొట్టుగాక!

చంద్రుని శిరసున ధరించిన అనే విశేషణం సాభిప్రాయం. తాపాన్ని పోగొట్టడానికి చల్లదనం కావాలి. చంద్రుడు చల్లదనమిస్తాడు. ఆ చంద్రుని శిఖలో ధరించినవాడు శివుడు. కనుక, శివుడు తాపమును పోగొట్టగలడు. ఈ విధంగా చంద్రశేఖరుడనే మాట అర్థవంతంగా ప్రయోగింపబడింది. కనుక ఇది పరికరాలంకారం.

**19. సమాసోక్త్యలంకారం**

ప్రస్తుతమును చెప్పినపుడు అప్రస్తుతము స్ఫురిస్తే అది సమాసోక్త్యలంకారము.

ఉదా॥ ఐంద్రీ ముఖమును చంద్రుడు రక్తుడై ముద్దిడుకొనుచున్నాడు చూడు.

ఇక్కడ చంద్రోదయ వర్ణన ప్రస్తుతం. ఈ వర్ణన వినగానే అప్రస్తుతం ఒకటి స్ఫురిస్తుంది. ఐంద్రి అంటే తూర్పు దిశ అని ఒక అర్థం. ఇంద్రుడికి సంబంధించిన స్త్రీ అని మరొక అర్థం. రక్తుడు అంటే ఎరుపు వర్ణము కలవాడనీ, అనురాగం కలవాడనీ అర్థాలు. ఇక్కడ తూర్పు ముఖమును చంద్రుడు ముద్దు పెట్టుకోవటం అనేది అర్థం కాగా, పైకి కనిపించని అర్థం మరోటి వుంది. ఇంద్రుడికి చెందిన స్త్రీని చంద్రుడు ముద్దు పెట్టుకొంటున్నాడు అని. దీనివల్ల నాయకుడు స్వభార్యను కాక అన్యస్త్రీని ముద్దు పెట్టుకుంటున్నాడని స్ఫురిస్తుంది.

**20. సారాలంకారం**

ఉత్తరోత్తర విషయాలను ఉత్కృష్టముగా వర్ణించటము సారాలంకారము.

ముందు చెప్పిన దానికంటె తరువాతవి అధికంగా వర్ణించబడటం ఇక్కడి అంశం.

ఉదా॥ తేనె మధురము, తేనె కన్న అమృతము మధురము, అమృతము కంటె కవివాక్కులు మధురము.

ఇక్కడ ముందు చెప్పిన దానికంటె తర్వాత అంశాలు ఒక దాని కంటె మరొకటి గొప్పవిగా చెప్పబడినాయి.

**21. భ్రాంతిమంతాలంకారం**

ఒక వస్తువును వేరొక వస్తువుగా భ్రమించుట భ్రాంతిమంతాలంకారము.

ఉదా॥ తుమ్మెద నీ ముఖమును కమలమనుకొనుచున్నది.

ఇక్కడ ముఖాన్ని చూసి తుమ్మెద కమలము అని భ్రమపడింది.

**22. ప్రతీపాలంకారం**

ఉపమానముము ఉపమేయముగా చెపితే అది ప్రతీపాలంకారము.

ఉదా॥ పద్మములు నీ కన్నులవలె ఉన్నవి.

కన్నులు వర్ణింపవలసిన విషయాలు. అంటే ఉపమేయం. సమాన్యంగా కళ్ళను పద్మంతో పోలుస్తారు. అంటే పద్మం ఉపమానం. కానీ, ఇక్కడ పద్మాలు కనులతో పోల్చబడుతున్నాయి. కనుక ప్రతీపం.

**23. సందేహాలంకారం**

ఒక వస్తువును చూసి, అదా లేక ఇదా అని సందేహించడము.

ఉదా॥ ఆమె ముఖము కమలమో, చంద్రుడో మాకు కూడా నిర్ణయం లేదు.

ఇక్కడ ముఖము కమలమా, చంద్రుడా అనేది సందేహం.

## 6. సొంత వాక్యాలు

1. **అడవిగాచిన వెన్నెల :** వినయం లేని విద్య అడవిగాచిన వెన్నెల వంటిది.
2. **అప్పజెప్పు :** ఏ రోజు పాఠమును ఆ రోజు అప్పజెప్పుట మంచి అలవాటు.
3. **అల్లారు ముద్దు :** శ్రీరాముడిని కౌసల్య అల్లారు ముద్దుగా పెంచెను.
4. **అండదండలు :** శ్రీకృష్ణుని అండదండలతో పాండవులు విజయము సాధించిరి.
5. **అందెవేసిన చేయి :** ధనుర్విద్యలో అర్జునుడిది అందెవేసిన చేయి.
6. **అక్షరలక్షలిచ్చు :** శ్రీకృష్ణదేవరాయలు మహాకవులకు అక్షర లక్ష లిచ్చెడివాడు.
7. **అరచేతిలో వైకుంఠము :** మోసగాడు అరచేతిలో వైకుంఠము చూపును.
8. **అరికాలిమంటి నెత్తికెక్కు :** దుర్యోధనుని దుర్మార్గమునకు భీమునికి అరికాలిమంట నెత్తికెక్కినట్లగుచుండెను.
9. **ఆటపట్టు :** గ్రామీణ సంస్కృతికి భారతదేశము ఆటపట్టు.
10. **ఆలవాలము :** భారతదేశము ప్రాచీన సంస్కృతికి ఆలవాలమై యున్నది.
11. **ఆపాదమస్తకము :** శ్రీకృష్ణుడి ఆదరమునకు కుచేలుడు ఆపాదమస్తకము పులకించెను.
12. **ఆపోశనము :** అగస్త్యుడు సముద్రమును ఆపోశన పట్టెను.
13. **ఇచ్చకములాడు :** సత్యభామతో శ్రీకృష్ణుడు ఇచ్చకము లాడెడివాడు.
14. **ఈడుజోడు :** సుభద్ర, అర్జునులకు ఈడుజోడు కుదిరెను.
15. **ఉడుతభక్తి (ఉడతాభక్తి) :** తుఫాను బాధితులకు ఉడతభక్తితో నేను సహాయము చేసితిని.
16. **ఉఱ్ఱూతలూపు :** స్వామీ వివేకానంద ఉపన్యాసము ఎందరినో ఉఱ్ఱూతలూ పెను.
17. **ఎముకలేని చెయ్యి :** దానగుణంలో కర్ణుడిది ఎముకలేని చెయ్యి.
18. **ఎదురు బొదురు :** నేను, కమల ఎదురు బొదురుగా కూచొని చదరంగము నాడినాము.

**19. ఏకరువు పెట్టు :** తన కష్టములను భూదేవి శ్రీ మహావిష్ణువుతో ఏకరువు పెట్టెను.

**20. ఏటికి ఎదురీదు :** మా అమ్మ కష్టములలో ఏటికి ఎదురీది నిలిచినది

**21. ఏకగ్రీవముగా :** మా క్లాసులో నేను లీడరుగా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడినాను.

**22. కన్నెఱ్ఱ చేయు :** పాండవులపై దుర్యోధనుడు అకారణముగా కన్నెఱ్ఱ చేసెడివాడు.

**23. కన్నుకుట్టు :** పాండవుల వైభవమును చూచి కౌరవులకు కన్నుకుట్టినది.

**24. కర్ణకఠోరము :** వచ్చీరాని సంగీతము కర్ణకఠోరముగా నుండును.

**25. కత్తినూరు :** దుర్యోధనుడు నిత్యము భీమునిపై కత్తినూరు చుండెను.

**26. కరతలామలకము :** వివేకానందునికి వేదాంతము కరతలామలకమయ్యెను.

**27. కళ్ళు నెత్తికి వచ్చు :** కంసుడు కళ్లు నెత్తికి వచ్చినట్లు ప్రవర్తించి నశించెను.

**28. కన్నీరు మున్నీరు :** శ్రీరాముడు అడవికి పోగా దశరథుడు కన్నీరు మున్నీరుగా విలపించెను.

**29. కనువిప్పు కలిగించు :** గాంధీజీ అహింసావాదంతో ఆంగ్లేయులకు కనువిప్పు కలిగించెను.

**30. కన్నుల పండుగ :** మా ఇంట్లో దీపావళి కన్నుల పండుగగా జరిగినది.

**31. కడుపార :** పేదలకు కడుపార అన్నము పెట్టువారు ధన్యులు.

**32. కంకణము కట్టుకొను :** మన్య ప్రజల రక్షణకు అల్లూరి సీతారామరాజు కంకణము కట్టుకొనెను.

**33. కండకావరము :** శిశుపాలుడు కండకావరముతో శ్రీకృష్ణుని ఎగతాళి చేసెను.

**34. కాలికి బుద్ధి చెప్పు :** హనుమంతుని పరాక్రమమునకు రాక్షసులు కాలికి బుద్ధి చెప్పుచుండిరి.

**35. కీలుబొమ్మలు :** భగవంతుని చేతిలో మనుషులు కీలుబొమ్మలు.

**36. కుండపోత :** ఈ ఏడాది కుండపోతగా వానలు కురిసెను.

**37. కుంభవృష్టి :** తుఫాను కారణముగా కుంభవృష్టిగా వానలు కురిసెను.

38. **కైంకర్యము చేయు :** భక్తులు తమ మనుసును భగవంతునికి కైంకర్యము చేయుదురు.

39. **కొట్టిన పిండి :** శ్రీనాథ కవికి కావ్యరచన కొట్టిన పిండి.

40. **కొమ్ములు తిరిగిన :** భీముడు కొమ్ములు తిరిగిన మల్లయోధుడు.

41. **కొల్లగొట్టు :** బ్రిటిష్‌వారు మన దేశమును కొన్ని యేళ్లపాటు కొల్లగొట్టిరి.

42. **కొరకరాని కొయ్య :** బ్రిటిష్‌వారికి గాంధీజీ కొరకరాని కొయ్య అయ్యెను.

43. **కొంగుపసిడి :** భోజుడు కవులపాలిటి కొంగుపసిడి.

44. **కొంగుబంగారము :** భగవంతుడు భక్తులపాలిటి కొంగుబంగారము.

45. **గడగడలాడు :** మహాత్మాగాంధీ పేరువినిన బ్రిటిష్‌వారు గడగడలాడుచుండిరి.

46. **గగన కుసుమము :** పేదలకు విమాన ప్రయాణము గగన కుసుమము.

47. **గతజల సేతుబంధనము :** గడచిన దాన్ని గురించి బాధపడుతూ కర్తవ్యాన్ని మరవటము గతజల సేతుబంధనము వంటిది.

48. **గాలిమేడలు :** కర్తవ్యాన్ని విస్మరించి గాలిమేడలు కట్టుట మంచిది కాదు.

49. **గుండెదిగులు :** శ్రీరాముని పరాక్రమము రావణునికి గుండెదిగులు కలిగించెను.

50. **గొడ్డలిపెట్టు :** రావణుని మరణము లంకావైభవమునకు గొడ్డలి పెట్టు అయ్యెను.

51. **గోరంతలు కొండంతలు :** కొందరు తమ కష్టములను గోరంతలు కొండంతలు చేసి చెప్పుదురు.

52. **చదువుసంధ్యలు :** గుణనిధి చదువు సంధ్యలు మాని భ్రష్టుడయ్యెను.

53. **చక్కదిద్దు :** జీసస్ తన బోధల ద్వారా ఎందరినో చక్కదిద్దెను.

54. **చంద్రునకు నూలుపోగు :** మా వూళ్లో మహాకవి సన్మాన నిధికి చంద్రునకు నూలుపోగులాగా నేనూ విరాళమిచ్చితిని.

55. **చిలుకపలుకులు :** పసిపాపల మాటలు చిలుకపలుకులవలె ముద్దుగా ఉండెను.

56. **చిందరవందర :** అర్జునుని పరాక్రమమునకు కౌరవసేన చిందర వందర అయ్యెను.

57. **చీటికి మాటికి :** పసిపిల్లలు చీటికిమాటికి ఏడ్చుచుందురు.

58. **చుక్క తెగిపడినట్టు :** నిన్న రాత్రి మా బంధువులు చుక్క తెగిపడినట్టు హఠాత్తుగా వచ్చినారు.

59. **చెవికోసుకొను :** నేను కర్ణాటక సంగీతమనిన చెవికోసుకుంటాను.

60. **చెవి నిల్లు కట్టుకొని చెప్పు :** సీతను తిరిగి ఇవ్వుమని విభీషణుడు రావణుని చెవినిల్లు కట్టుకొని చెప్పెను.

61. **చెవులార :** నిన్న రాత్రి హరికథను చెవులార వింటిని

62. **చెప్పులరిగేలా తిరుగు :** మా బాబాయి ఉద్యోగము కోసము చెప్పులరిగేలాగ తిరుగుతున్నాడు.

63. **చెమ్మగిల్లు :** భారతదేశపు పేద జనాన్ని చూసి గాంధీజీ కళ్లు చెమ్మగిల్లినవి.

64. **వెన్నతో పెట్టిన విద్య :** బాణము వేయుట ఏకలవ్వునికి వెన్నతో పెట్టిన విద్య.

65. **వెన్నుచూపు :** కౌరవసేనను చూసి ఉత్తర కుమారుడు వెన్ను చూపి పారిపోయెను.

66. **వేనోళ్ళ :** కాళిదాసు కవిత్వాన్ని లోకం వేనోళ్ళ ప్రశంసిస్తుంది.

67. **శిలాక్షరం :** మహాకవుల కావ్యాలు శిలాక్షరాలుగా నిలుస్తాయి.

68. **శ్రీరామరక్ష :** తల్లి దీవెన తనయులకు శ్రీరామరక్ష.

69. **సొరకాయ కోతలు :** మా అన్న కలెక్టరు నవుతానని సొరకాయ కోతలు కోసినాడు.

70. **స్వస్తి చెప్పు :** దురలవాట్లకు స్వస్తి చెప్పుట ఉత్తమ లక్షణము.